# గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై చర్చ



విజయవాడ,అక్టోబర్ 29 (నిఘా న్యూస్): బడ్జెట్ సమావేశాలపై సిఎం చంద్రాబాబు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వివరించినట్లు సమాచారం. బుధవారం జరగబోయే అసెంబ్లీ సమావేశాల కార్యచరణ గురించి గవర్నర్‌కు సిఎం చంద్ర బాబు వివరించినట్లు సమాచారం. అలాగే బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాలంటూ గవర్నర్‌ను సీఎం చంద్రబాబు కోరినట్లు సమాచారం. గవర్నర్ ..మిగతా 2లో

కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ బుధవారం 30 అక్టోబర్ 2024
సంపుటి: 14, సంచిక: 210, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

# ఈఆర్సీకి కేటీఆర్ కృతజ్ఞతలు



విద్యుత్ భారం పడకుండా కాపాడారు

2

# ముగిసిన కేసీఆర్ రాజకీయ జీవితం



## అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేను

- నవంబర్ 1న మూసీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తాం
- త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం
- జన్వాడలో దావత్ అయితే క్యాసినో కాయిన్స్ ఎలా వచ్చాయి
- తప్పు చేయకుంటే రాజ్ పాకాల ఎందుకు తప్పించుకున్నారు
- హైడ్రావల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందన్న వాదన తప్పు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 29 (నిఘా న్యూస్): దీపావళి అంటే ఎవరైనా చిచ్చుబుడ్లు కాలుస్తారు. కానీ, జన్వాడ ఫామ్‌హౌస్‌లో మాత్రం సారాబుడ్లు బయటికొచ్చాయి. అనధికార విదేశీ మద్యంతో కేటీఆర్ దీపావళి జరుపుకొంటున్నారా, జన్వాడ ఫామ్‌హౌస్‌పై భారాస కట్టుకథలు హాస్యాస్పదం. ప్రభుత్వం చేసే మంచి పనులకు మీడియా సహకరించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల విందుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. మంగళవారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. మాకు దీపావళి అంటే చిచ్చు బుడ్లు వాళ్లకు మాత్రం సారా బుడ్లు' అని విమర్శించారు. దీపావళి దావత్ అలా చేస్తారని తమకు తెలియదని ఎద్దేవా చేశారు. ఏమీ చేయకపోతే రాజ్ పాకాల ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ ఎందుకు అడిగారని నిలదీశారు. ఇంటి దావత్‌లో క్యాసినో కాయిన్స్, విదేశీమద్యం ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మూసీ పరివాహకంలో సమయం వచ్చినప్పుడు పాయాత్ర చేస్తా. అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తా. భారాస అక్రమ సొమ్ముతో సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారం చేస్తోంది. ఎంతో ఆలోచించి హైడ్రాను రంగంలోకి దించాం. హైడ్రాపై దేశమంతా తెలిసేలా భారాస ప్రచారం చేసింది. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరికాదు. దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత వచ్చింది. సినిమాల్లో రాజమౌళి, వర్మ ఇద్దరిది వేర్వేరు స్టయిల్. రాజకీయాల్లో నా స్టైల్ నాది, కేటీఆర్ స్టైల్ కేటీఆర్‌ది. రాజకీయంగా కేసీఆర్ పన్కెపోయింది. రూ.7.50 లక్షల కోట్ల అప్పులు ..మిగతా 2లో

# ఒక బిడ్డకు... ఇంకో బిడ్డ అన్యాయం



## అబద్ధాలు చెబుతున్న వైవి సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి

- ఒక తల్లిగా చూస్తూ తట్టుకోలేక పోతున్నాను
- పాప మేలు కోరుతానని జగన్ తండ్రికి మాట ఇచ్చారు
- ఆస్తుల పంపకం జరగనే లేదు
- వైఎస్ ఆస్తుల్లో ఇద్దరికీ సమాన వాటా ఉంది
- తల్లిగా అన్యాయం జరుగుతున్న వారి పక్షాన ఉండడం ధర్మం
- వైఎస్ అభిమానులకు భార్య విజయమ్మ బహిరంగ లేఖ

అమరావతి అక్టోబర్ 29 (నిఘా న్యూస్): దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆస్తులు పంచారన్నది అవాస్తవమని ఆయన భార్య వైఎస్ విజయమ్మ తేల్చిచెప్పారు.తాను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా జరగ కూడనివి అన్ని తన ముందే జరిగిపోతున్నాయని ఆమె ఆవేదన చెందారు. వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి ఎన్నో అసత్యాలు చెప్పారని అన్నారు. ఈ మేరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులకు ఆయన సతీమణి విజయమ్మ బహిరంగ లేఖ రాశారు. అబద్దాల పరంపర కొనసాగుతుందని చెప్పారు. జగన్, షర్మిల పేరిట వైఎస్ కొన్ని ఆస్తులు పెట్టారని తేల్చిచెప్పారు. ఇది ముమ్మాటికీ ఆస్తులు పంపకం కాదని అన్నారు. షర్మిలకు వైఎస్సార్ ఆస్తులు ఇచ్చారని లిస్టు చదివారు. అలాగే జగన్ పేరిట పెట్టిన ఆస్తుల జాబితా కూడా చదివి ఉండాల్సింది. ఆడిటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డికి అన్నీ తెలుసు. ఇంటి బంధువుగా ఎంవోయూపై వైవీసుబ్బారెడ్డి సంతకం చేశారు. మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం బాధ కలిగించింది. అబద్దాల పరంపర కొనసాగకుండా ఉండేందుకే నిజం చెబుతున్నా అమ్మగా నాకు ఇద్దరు సమానమే. అలాగే వైఎస్సార్ మాట కూడా ముఖ్యమే. ఆస్తులు ఇద్దరు బిడ్డలకు సమానం అనేది నిజం. నలుగురు పిల్లలకు ఆస్తులు సమానంగా ఉండాలన్నది వైఎస్సార్ ఆజ్ఞ. బాధ్యత గల కొడుకుగా జగన్ ఆస్తులను సంరక్షించాలి. ఆ మేరకు వైఎస్సార్ చివరి రోజుల్లో ఆయనకు జగన్ మాట ఇచ్చారు. నాన్న నీ తర్వాత పాప మేలు కోరే వారిలో నేనే మొదటివాడిని అని, వైఎస్సార్‌కు జగన్ మాట ఇవ్వడం కూడా నిజం. ఈ విషయం 'నాలో నాతో వైఎస్సార్' పుస్తకంలో ఎప్పుడో రాశానని విజయమ్మ స్పష్టం చేశారు. అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. అలాగే ఆస్తులు ఇద్దరికీ సమానమనేది నిజం. అయితే ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు బాధ కలిగిస్తున్నాయి. తల్లిగా అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండటం నా విధి, ధర్మం. ఇంట్లో ఒకబిడ్డకు ఇంకోబిడ్డ అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం కష్టం. హక్కు ఉంది కాబట్టే షర్మిలకు రూ.200 కోట్ల డివిడెండ్లు ఇచ్చారు. పాపకు హక్కు ఉంది కాబట్టే ఎంవోయూ రాసుకున్నారు. ఎంవోయూలో ఉన్న సరస్వతి ..మిగతా 2లో



# సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే

## నవంబర్ 6 నుండి ప్రారంభం

### జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం దిశా నిర్దేశం.. ఉప ముఖ్యమంత్రి భట్టి సమీక్ష

హైదరాబాద్ అక్టోబర్ 29 (నిఘా న్యూస్): భారత రాజ్యాంగం మన సమాజంలో సమానత్వాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో నవంబర్ 6 వ తేదీ నుండి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో అన్నింటినీ చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మంగళవారం సచివాలయం కేంద్రంగా జరిగిన అన్ని జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా నుండి పాల్గొన్నారు. ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ జిల్లాల కేంద్రాల నుండి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, డి.అనసూయ (సీతక్క), శ్రీ జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ , సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎస్. హరీష్ తదితరులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగం మన సమాజంలో సమానత్వాన్ని సాధించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఆ లక్ష్యం మేరకు రాష్ట్రంలో వివిధ జాతుల సామాజిక, ఆర్థిక, ఆదాయ ..మిగతా 2లో

# ప్రపంచ రికార్డుకు సిద్ధమవుతున్న అయోధ్య

## ఒకేసారి లక్షలాది దీపాలు వెలిగించేందుకు రంగం సిద్ధం



లక్నో అక్టోబర్ 29 (నిఘా న్యూస్) దీపావళి వేడుకలకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరం ముస్తాబవుతోంది. ఒకేసారి లక్షలాది దీపాలు వెలిగించి ప్రపంచ రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఏటా దీపావళి పర్వదినానికి ముందు రోజు అయోధ్యలోని సరయూ నదీ తీరంలో 'దీపోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే గతేడాది ఏకంగా 25 లక్షల దీపాలు ఒకేసారి వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. అయితే ఈ ఏడాది 28 లక్షల దీపాలతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాలని ..మిగతా 2లో



2

# తండ్రి కొడుకులకు... బూతు పురాణంలో డాక్టరేట్ ఇవ్వచ్చు

వాళ్లు చేస్తే సంసారం మిగిలిన వాళ్ళు చేస్తే వ్యభిచారం

దీపావళికి పూజలు చేయాలి.. దావత్‌లు చేస్తారా

మూసీ పునరుద్ధరణకు బీజేపీ వ్యతిరేకం కాదు

మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

# వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్

## పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

### ఢిల్లీ బెంగాల్లో అమలు చేయక పోవడంపై విచారం




న్యూఢిల్లీ అక్టోబర్ 29 (నిఘా న్యూస్): దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించారు. ధన్వంతరి జయంతి, తొమ్మిదో ఆయుర్వేద డే సందర్భంగా ఈ పథకానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ-విన్ పోర్టల్ ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు కోట్లమంది సీనియర్ సిటిజన్లకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని అంచనా. ఆయుష్మాన్ ..మిగతా 2లో



# సత్య నాదెళ్లతో మంత్రి లోకేష్ భేటీ

## కొనసాగుతున్న లోకేశ్ అమెరికా పర్యటన

### పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖులతో భేటీ

అమరావతి అక్టోబర్ 29 (నిఘా న్యూస్): పెట్టుబడులే లక్ష్యంగా అమెరికాల పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ పలువురు ప్రముఖులను కలిసి చర్చిస్తున్నారు. ఎపి పెట్టుబడులకు అనుకూలమని చెబుతున్నారు. తాజాగా రెండ్ మండ్‌లో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో పాటు శాన్ ఫ్రాన్సిస్కోలో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో భేటీ అయిన లోకేష్, ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నేతృత్వంలోని ప్రగతిశీల ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో ముందుకు సాగుతోందనీ, ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పెట్టుబడులకు అన్నివిధాల అనుకూలమైన ప్రాంతమని చెప్పారు. ముందుగా సత్య నాదెళ్లతో జరిగిన సమావేశంలో క్లౌడ్-ఆధారిత ప్లాట్ ఫామ్‌లను అమలు చేయడం, డేటా అనలిటిక్స్ కోసం ఏఐని ఉపయోగించడం, సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడం, స్మార్ట్ సిటీ కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అనుసరించే డిజిటల్ గవర్నెన్స్ విధానాలకు ..మిగతా 2లో

# సబ్ రిజిస్ట్రార్ జ్యోతి అరెస్ట్

## అక్రమంగా ప్లాటు ఆక్రమించి రిజిస్ట్రేషన్

### రిమాండ్‌కు తరలించిన మేడ్చల్ కోర్టు

2

# బస్సు ప్రమాదం.. 12 మంది మృతి

## రాజస్థాన్ బస్సు ప్రమాదంలో 40 మందికి పైగా క్షతగాత్రులు



జయపుర అక్టోబర్ 29 (నిఘా న్యూస్): రాజస్థాన్‌లోని సీకర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, 40 మందికి పైగా గాయపడ్డారు. సాలాసర్ నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు లక్ష్మణ్‌గఢ్‌కు దాటిన తర్వాత ఒక కల్వర్ట్‌ను ..మిగతా 2లో

# తగ్గిన కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు

## కాంగ్రెస్ తీసుకుని వచ్చిన మార్పు ఇదే ఎక్స్ వేదికగా హరీష్ రావు విసుర్లు



హైదరాబాద్ అక్టోబర్ 29 (నిఘా న్యూస్): కాంగ్రెస్ పాలనలో కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గిపోయాయంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయని, తెలంగాణ ఆర్థిక అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర కార్పొరేట్ ..మిగతా 2లో



## ఒక బిడ్డకు... ఇంకో బిడ్డ అన్యాయం

మొదటి పేజీ తరువాయి...

షేర్స్ వందశాతం, ఎంవోయూలో లేని యలహంక ప్రాపర్టీ వందశాతం వెంటనే ఇస్తానని, జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు. వైఎస్సార్ ఉన్నప్పుడు ఆస్తులు పంచలేదు. అందరం కలిసే ఉన్నాం. ఇప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులేనని వివరించారు. అన్నీ తెలిసీ ఇప్పుడు విజయసాయిరెడ్డి అవాస్తవాలు మాట్లాడారు. వీటన్నింటికీ అప్పుడు, ఇప్పుడూ నేనే సాక్షిని. అటాచ్‌మెంట్‌లో లేని ఆస్తుల్లోనూ పాపకు అన్యాయం జరిగింది. రాజకీయాల్లో జగన్ చెప్పినట్టే పాప చేసింది. ఇష్టం వచ్చినట్టు మాట్లాడవద్దని అందరినీ కోరుతున్నానని విజయమ్మ తన లేఖలో వెల్లడించారు.

## ఈఆర్సీకి కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్ అక్టోబర్ 29 (నిఘా న్యూస్): విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి ఈఆర్సీ తిరస్కరించినందుకు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా ఆపినందుకు విజయ సూచికగా ఈ సంబురాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పది నెలల కాలంలోనే 18,500 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసిందని కేటీఆర్ అన్నారు. ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా వ్యతిరేకించామని తెలిపారు. పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని దీనిపై ఈఆర్సీపి ఒప్పించలిగామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా తమ వాదనలోని సహేతుకత, న్యాయాన్నిను ఈఆర్సీ గుర్తించి విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించిందని అన్నారు. విద్యుత్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించి నందుకు ఈఆర్సీ చైర్మన్ శ్రీ రంగారావు, సభ్యులు మనోహర్ రాజు, కృష్ణయ్యకు తెలంగాణ ప్రజల తరపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. విద్యుత్ చార్జీల పేరిట రూ. 18,500 కోట్ల అదనపు భారం ప్రజలపై మోపడాన్ని హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో నిర్వహించిన మూడు బహిరంగ విచారణలలో తాము తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ జ్యోతి అరెస్ట్



హైదరాబాద్ అక్టోబర్ 29 (నిఘా న్యూస్): అక్రమంగా ఆక్రమించిన భూమికి రిజిస్టర్ చేసిన సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. మేడ్చల్ కోర్టులో పోలీసులు మంగళవారం హాజరు పరచగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. సుభాష్ నగర్‌లో 200 గజాల స్థలాన్ని నకిలీ పత్రాలతో బీఆర్ఎస్ నేత పద్మాజా రెడ్డి కబ్జా చేయగా. బీఆర్ఎస్ హయాంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన జ్యోతి నకిలీ పత్రాలతో ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేయడానికి సహకరించింది. కాగా ఇదే కేసులో ఇటీవల పద్మజా రెడ్డిని అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తాజాగా ఈ కేసులో జ్యోతిని పోలీసులు అరెస్ట్ చేసి ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఓ ఖాళీ స్థలంపై కన్నేసిన కొందరు, ఏకంగా ఆ స్థల యజమాని మృతి చెందినట్లు నకిలీ ధ్రువపత్రాన్ని సృష్టించారు. సబ్ రిజిస్ట్రార్ సాయంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఇందులో కీలక సూత్రధారిగా ఉన్న బారాస మహిళా నేత, మరో ఐదుగురిని ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు జ్యోతిని మంగళవారం అరెస్టు చేసి మేడ్చల్ కోర్టులో హాజరు పర్చగా న్యాయస్థానం ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన లెండ్యాల సురేశ్‌కు సుభాష్‌నగర్–వెంకట్రాద్రినగర్‌లో 200 గజాల స్థలం ఉంది. ఆ స్థలం ఖాళీగా ఉన్నట్లు సుభాష్‌నగర్‌కు చెందిన భారాస మహిళా నేత పద్మజారెడ్డి, అలియాస్ కుత్బుల్లాపూర్ పద్మక్క(32) గుర్తించింది. హయత్‌నగర్‌కు చెందిన రేపాక కరుణాకర్(34)ను సంప్రదించింది. రూ.3.50 లక్షలు చెల్లించి నకిలీ పత్రాల తయారీకి ఒప్పందం చేసుకుంది. ఇంటి యజమాని 1992లోనే మృతి చెందినట్లు మరణ ధ్రువపత్రం సృష్టించారు. రవిశంకర్ అనే వ్యక్తిని అతడి కుమారుడిగా సృష్టించారు. ఆధార్ కేంద్రం ఆపరేటర్‌గా గగనం నరేంద్ర(25) సహకారంతో హరీశ్ అనే వ్యక్తిని రవిశంకర్‌గా చూపించేందుకు నకిలీ పాన్‌కార్డు తయారు చేయించారు. దాంతో ఆధార్‌లో పేరు మార్పులు చేశారు. 2023 ఫిబ్రవరిలో కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అప్పటి అధికారి జ్యోతి సాయంతో పద్మజారెడ్డి సోదరి నాగిరెడ్డి కోమలకుమారికి ఈ స్థలాన్ని రవిశంకర్ విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ పూర్తి చేయించారు. నిందితుల వద్ద పోలీసులు నకిలీ పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, స్కానర్ తదితర పరకరాలను స్వాధీనం చేసుకున్నారు. స్థల యజమాని లెండ్యాల సురేశ్ ఫిర్యాదుతో స్థలం కబ్జా బాగోతం బయటికొచ్చింది.

## బస్సు ప్రమాదం.. 12 మంది మృతి

మొదటి పేజీ తరువాయి...

ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగ్రాతులను లక్ష్మణ్ గఢ్‌లోని ఆసుపత్రిలో చేర్చగా పలువురి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. సాలాసర్ నుంచి వస్తున్న బస్సు మధ్యాహ్నా లక్ష్మణ్‌గఢ్ వద్ద అదుపుతప్పి ఒక కల్వర్ట్‌ను ఢీకొన్నట్టు జిల్లా ఎస్పీ భువన్ భూషణ్ తెలిపారు. 12 మంది ప్రాణాలు కోల్పోగా పెద్ద సంఖ్యలో గాయపడ్డారని, వారిని లక్ష్మణ్‌గఢ్, సీకర్ ఆసుపత్రుల్లో చేర్చామని చెప్పారు. కాగా, ఏడుగురు ప్రయాణికులు లక్ష్మణ్‌గఢ్‌లో మృతిచెందినట్టు ఎస్‌కే ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మొత్తం 27 మంది పేషెంట్లు తమ ఆసుపత్రికి వచ్చారని, ఇద్దరు మార్గమధ్యంలోనే మృతి చెందగా, చికిత్స అందిస్తుండగా మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఏడుగురు పేషెంట్లను తదుపరి చికిత్స కోసం జైపూర్‌కు పంపుతున్నామని, ప్రస్తుతం 22 నుంచి 23 మంది తమ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారని వివరించారు. సీకర్ జిల్లాలో బస్సు ప్రమాద ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు తక్షణ సాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

# ముగిసిన కేసీఆర్ రాజకీయ జీవితం

మొదటి పేజీ తరువాయి...

కేసీఆర్ మిగిల్చి వెళ్లారు. రుణమాఫీలో సాంకేతిక లోపాలు ఉన్నవి మాత్రమే ఆగాయి. 10 నెలల్లో 50వేల ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. టీజీపీఎస్సీ నియామకాల్లో 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే. నాది చిన్నవయస్సు రాజకీయంగా ఇంకా భవిష్యత్తు ఉంది. అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేను. అందరి విషయంలోనూ ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తాం అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విచారణ విషయంలో కక్షసాధింపు ఉండదని తేల్చిచెప్పారు. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. రాజకీయంగా నష్టం జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజలకు చేయాలనుకున్న మేలు చేసి తీరతామని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మూసీపై ముందడుగే వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. నిర్ణయం తీసుకునే ముందే వెయ్యిసార్లు ఆలోచిస్తామని అన్నారు. నిర్ణయం తీసుకున్నాక వెనక్కి తగ్గేదే లేదని తేల్చిచెప్పారు. నవంబర్ 1వ తేదీన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు పనులు మొదలు పెడుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తొలుత బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవంబరులో ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. భారాస నేతలు మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరాలను తెలియజేయాలి. నన్ను కలవడానికి



ఇబ్బంది అయితే మంత్రులు, అధికారులను కలిసి చెప్పొచ్చు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో టెండర్లు పిలుస్తాం. మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ప్రజా ప్రతినిధులను పంపుతాం. నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతాం. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపాను. ఈ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన కలిగింది. మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడని ప్రజలకు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుందని సిఎం రేవంత్ వివరించారు. మూసీ కోసం భూములిచ్చేవారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తాం. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోం బాపూఘాట్ దగ్గర బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తామని తెలిపారు. బాపూఘాట్ దగ్గర అభివృద్ధి కోసం ఆర్మీ స్థలం అడిగామని చెప్పారు. 15 రోజుల్లో ఎస్టీపీలకు టెండర్లు వేస్తామని తెలిపారు. మూసీ వెంట అంతర్జాతీయ వర్సిటీ, గాంధీ ఐడియాలజీ సెంటర్, రీక్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడిరచారు. మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలను తెచ్చి గండిపేటలో పోస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ట్రంక్ లైన్ కోసం నవంబర్ మొదటి వారంలో టెండర్లు పిలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టును ఎన్జీవోలు వ్యతిరేకిస్తే అర్థం ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ఎందుకు వ్యతిరేకిస్తుందో అర్థం కావట్లేదు. కేటీఆర్ ప్రపంచస్థాయి మేధావిని అనుకుంటారు. మూసీని బాగు చేసే అంశంలో కేటీఆర్ తన ఆలోచనలు చెప్పొచ్చు. అంతర్జాతీయ అవగాహన ఉన్న ఆయనకు మూసీని ఎలా బాగు చేయాలో తెలియదా ఈ ప్రాజెక్టుపై కేటీఆర్ నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నా. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల తమ ప్రతిపాదనలు తెలపాలి. నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది. 55 కి.మీ మూసీ పునరుజ్జీవం పూర్తయితే అద్భుతనగరం ఆవిష్కృతమవుతుందని వివరించారు. ముఖ్యమంత్రి అవ్వాలనుకున్న నా కల నెరవేరింది. ముఖ్యమంత్రి పదవి కంటే పెద్ద కలలు నాకు వేరే ఏమీ లేవు. అందువల్ల వచ్చిన అవకాశంతో మంచి చేయాలన్న సంకల్పంతో ఉందుకు సాగుతున్నామని అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా.. నేను రుణమాఫీ చేశా. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.. ఫీజు రీయింబర్స్ మెంట్ చేశాం అని అన్నారు.

## సత్య నాదెళ్లతో మంత్రి లోకేష్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

మైక్రో సాఫ్ట్ సహకారాన్ని అందించాలని లోకేష్ కోరారు. ఏఐ ప్రాజెక్టులకు అనువుగా ఉన్న అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా తయారు చేయాలని భావిస్తున్నామని, ఇందులో భాగంగా అమరావతి లో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని లోకేష్ వివరించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డైనమిక్ టెక్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, వ్యూహాత్మక భాగస్వామ్యం, ఆవిష్కరణల కోసం ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాల్సింది గా కోరారు. ఏపీలో నెలకొన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పర్యావరణ వ్యవస్థను ఒకసారి మా రాష్ట్రానికి వచ్చి పరిశీలించమని కోరిన లోకేష్ ఏపిలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశోధించాలని, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి ప్రణాళికల్లో అధునాతన సాంకేతికను ఏకీకృతం చేయడానికి భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ మైక్రోసాఫ్ట్ సీఈఓను కోరారు. లోకేష్‌తో భేటీ సందర్భంగా సత్య నాదెళ్ల మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్ సంస్థ సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఉందని చెప్పారు. అనంతరం శాన్ ఫ్రాన్సిస్కోలో అడోబ్ కంపెనీ సీఈవో శంతను నారాయణ్‌తో లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శంతను నారాయణన్ మాట్లాడుతూ అడోబ్ కంపెనీ ప్రస్తుతం డిజిటల్ మీడియా, క్లౌడ్–ఆధారిత సేవల్లో అగ్రగామిగా ఉంది. ఫోటోషాప్, అక్రోబాట్, ఇల్లస్ట్రేటర్ వంటి సాధనాలను మరింత అందుబాటులోకి తెచ్చామని, సృజనాత్మకత, డాక్యుమెంట్ ఉత్పాదకత, ఏఐ%-%పవర్డ్ ఇన్నోవేషన్స్




రంగంలో ఎప్పటికప్పుడు అప్ డేటెడ్ వెర్షన్స్ ను అందుబాటు లోకి తెస్తున్నా మన్నారు. అలాగే శాన్‌ఫ్రాన్సిస్కోలోని యాపిల్ సంస్థ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ప్రియా బాలసుబ్రహ్మణ్యాన్ని కలిశారు. యాపిల్ యాక్టివిటీస్ విస్తరించడానికి ఏపీ అనుకూలమైన ప్రాంతంగా చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కోరిన చోట స్థలం ఇస్తామని తెలిపారు. తయారీ యూనిట్ స్టార్ట్ చేయాలని ఆహ్వానించారు. కావాల్సిన ప్రాంతంలో భూమితో పాటు కావాల్సిన సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అత్యంత నైపుణ్యం ఉన్న మానవ వనరులు ఉన్నాయని వాళ్లకు వివరించారు. ఏపీతో కలిసి పని చేసేందుకు ప్రియా సుబ్రహ్మణ్యం సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు.

## తండ్రి కొడుకులకు... బూతు పురాణంలో డాక్టరేట్ ఇవ్వచ్చు


విశాఖపట్నం అక్టోబర్ 29 (నిఘా న్యూస్): కేసీఆర్ కుటుంబంలో అంతా బూతులే మాట్లాడుతారని, కెసిఆర్ బాటలో ఇప్పుడు కెటిఆర్ నడుస్తున్నాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. వారిది బూతు పురాణం కుటుంబమని ఉదయం లేస్తే చాలు ఆ పార్టీ నేతలు అందరూ బూతులే మాట్లాడుతారని బండి సంజయ్ అన్నారు. వాళ్లు చేస్తే సంసారం మిగిలిన వాళ్ళు చేస్తే వ్యభిచారం అన్నట్టు మాట్లాడతారని మండిపడ్డారు. కేసీఆర్ తిట్టినట్లు బూతులు ఎవరు తిట్టలేదని. తండ్రి లాగే కొడుకు కేటీఆర్ ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఆ మేరకు మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బూతులు తిట్టేవాడు నోటీసిస్తే దానికి విలువ ఉంటుందా. నేనెప్పుడూ తిట్టలేదు.కేవలం విమర్శ మాత్రమే చేశాను. కేటీఆర్ పంపిన నోటీసుకు నేను సమాధానం కూడా ఇచ్చాను. అంతేకాదు నోటీసుకు నోటీసు కూడా ఇచ్చానని తెలిపారు. అలాగే జన్వాడ ఫామ్ హౌస్ ఘటనకు సంబంధించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా కేంద్రమంత్రి విమర్శలు గుప్పించారు. ఫామ్ హౌస్‌లో దావతులు పెట్టడానికి సిగ్గుండాలని అన్నారు. దసరాకి దావతులు చేసుకుంటారు. దీపావళికి ఎవరైనా దావతులు చేసుకుంటారా దీపావళికి దావతులు కాదు, లక్ష్మీ పూజలు చేసుకోవాలని అంటూ హితవుపలికారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తామన్నారు. పోలీసులు దాడి చేసినప్పుడు రాజ్ పాకాల పోలీసుల పక్కనే ఉన్నారని తర్వాత మాయమై పోయాడన్నారు. ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కొడుకు కుటుంబ సభ్యులను తప్పించింది ఎవరని ప్రశ్నించారు. చివరికి కొండను తవ్వి ఎలుకను కూడా రేవంత్ సర్కార్ పట్టలేక పోయిందంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఆర్ కే హెచ్ సర్కార్ నడుస్తోందని అంటే రేవంత్, కేటీఆర్, హరీష్ రావు అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌లో బావా బామ్మర్దుల పంచాయతీ నడుస్తోందన్నారు. కేసీఆర్ కొడుకుకి ట్విట్టర్ టిల్లు అని పేరు పెట్టినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటే అని అన్నారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ కొడుకు ఇద్దరూ ఒకటే అని తనకు భయపడి కేసీఆర్ కొడుకు నోటీసు ఇచ్చారన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏమైనా అయితే కేసీఆర్ మాట్లాడరని, జైలుకు వెళ్లినా స్పందించరన్నారు. కానీ కేసీఆర్ కొడుకు బావమరిదికి ఏమైనా అయితే మాత్రం, డీజీపీతో మాట్లాడతారా అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్‌ను, బీఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కొనే పార్టీ కేవలం బీజేపీ మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే మెడలు వంచుతామన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, మూసీ పేరుతో పేదలు ఉసురు పోసుకుంటే ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీని వెంటాడుతాం వేటాడుతామన్నారు. మంగళవారం విశాఖకు చేరుకున్న బండి సంజయ్ బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజును పరామర్శించారు. ఇటీవల విష్ణుకుమార్ రాజు మోకాలి ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం ఆయన నివాసానికి చేరుకున్న బండి సంజయ్ ఆరోగ్య పరిస్థితిపై ఎలా ఉంది అని విష్ణు కుమార్ రాజును అడిగి తెలుసుకున్నారు.

## వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్

మొదటి పేజీ తరువాయి...




కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు వైద్య సదుపాయం పొందుతారు. దీనికింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్‌భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లపైబడిన వారు ఇద్దరు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం వర్తిస్తుంది. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందొచ్చు. పథకంలో లబ్ధి పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్‌లో నమోద్కైన వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాలను ఆశించే ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ఢల్లీ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అమలు చేయడం లేదని అన్నారు. ఢల్లీ, పశ్చిమబెంగాల్‌లో 70 ఏళ్లు దాటిన వారికి సేవలందించ లేకపోతున్నందుకు వారికి తాను క్షమాపణలు చెప్పుకుంటున్నానని అన్నారు. ఆయుష్మాన్ యోజనలో ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేరలేదనీ, రాజకీయ వృత్తికి సంబంధించిన అడ్డుగోడల కారణంగా వారికి తాను సేవ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ప్రజల ప్రయోజనాలను రాజకీయాల కోసం పణంగా పెట్టడం మానవత్వం అనిపించుకోదని హితవు పలికారు. వైద్య చికిత్స కోసం ఇళ్లు, భూములు, నగలు అమ్ముకున్న సందర్భాలు గతంలో చాలానే ఉండేవని, తీవ్రమైన వ్యాధుల విషయంలో అయితే చికిత్సకు అయ్యే ఖర్చు వింటేనే పేద ప్రజలు వణికిపోయే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. పేద ప్రజలను వైద్యం చేయించుకోలేని నిస్సహాయత నుంచి బయటకు తీసుకురావాలనే ఆలోచన నుంచే ఆయుష్మాన్ బారత్ పథకం పుట్టిందని చెప్పారు.



## ప్రపంచ రికార్డుకు సిద్ధమవుతున్న అయోధ్య

మొదటి పేజీ తరువాయి...

యూపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే అక్టోబర్ 30న జరిగే దీపోత్సవ్ వేడుకలకు అయోధ్యా నగరి ముస్తాబవుతోంది. సరయూ నదీ తీరంలో దీపోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 51 ఘాట్‌లలో ఒకేసారి 28 లక్షల దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 30 వేల మంది వాలంటీర్లు ఈ దీపోత్సవం కార్యక్రమంలో భాగం కానున్నారు. ఇక రామ మందిరం నిర్మాణం తర్వాత తొలి సారి జరుగుతున్న దీపావళి పండుగ కావడంతో ఈ దీపోత్సవాన్ని మరింత అద్భుతంగా నిర్వహించాలని యూపీ సర్కార్ భావిస్తోంది. ఇందులో భాగంగానే రామ మందిర సముదాయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. బుధవారం సాయంత్రం 6:30 గంటలకు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సరయూ హారతి ఇస్తారు. అనంతరం నది ఒడ్డున దీపోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తూ దీపాలను లెక్కించనున్నారు. ఈ దీపోత్సవానికి అన్ని శాఖల మంత్రులు, ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నారు. కార్యక్రమం అనంతరం లేజర్ షో ఏర్పాటు చేశారు.




## సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే

మొదటి పేజీ తరువాయి...

విద్యా, రాజకీయ స్థితిగతులను తెలుసు కోవాల్సిన అవసరం ఉందని, అప్పుడే మనం మన సమాజంలో సమానత్వం కోసం విధానాలను రూపొందించగలమని ఆయన అన్నారు. రాష్ట్రంలో సామాజిక సర్వే ఈ ఉదాత్తమైన లక్ష్యాన్ని సాకారం చేసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లుగా మీ అందరికీ ప్రాధాన్యత ఉన్నదని, తమతమ జిల్లాలో లక్షలాది మంది ప్రజానీకానికి న్యాయం చేసేందుకు మీ సేవలు ఒక ప్రాతిపదికగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్లు సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్లు ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించించడం, ప్రతి ఎన్యుమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, గృహ సర్వే షెడ్యూల్, ఎన్యూమరేటర్స్ మాన్యువల్ అందే విధంగా చూసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్యుమరేటర్లకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని, వారికి కేటాయించిన సర్వే షెడ్యూల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండే విధంగా జిల్లా కలెక్టర్లు వారికి శిక్షణ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎన్యూమరేటర్లు ముందుగా ఇంటి జాబితాను పూర్తి చేసి, పాఠశాల వేళల తర్వాత ప్రతిరోజూ 5–7 ఇళ్లను సందర్శించడం ద్వారా ఇంటి షెడ్యూల్‌ను ప్రారంభించాలని, సర్వేలో నిర్వహణను పటిష్టంగా చేపట్టి నాణ్యమైన అవుట్‌పుట్ పొందడానికి అవసరమైన సమయాన్ని కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సర్వే ను నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణపై ప్రతి రోజు పర్యవేక్షక సిబ్బందితో సమీక్ష నిర్వహించాలని అన్నారు. సర్వే గురించి టామ్ టామ్ బీట్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రకటించాలని అన్నారు. సామాజిక కుల గణనను ప్రచారం చేయడానికి మీడియాను సమర్థవంతంగా ఉపయోగించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

మొదటి పేజీ తరువాయి...

జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు సీఎం చంద్రబాబు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలతోపాటు రాష్ట్రంలో శాంతి భద్రతలపై గవర్నర్ జస్టిస్ నజీర్‌కు సీఎం వివరించినట్లు తెలుస్తుంది.గత సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేదన్న సంగతి అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అలాగే బడ్జెట్‌లో పొందుపరిచిన అంశాలను సైతం ఈ సందర్భంగా గవర్నర్‌కు సీఎం చంద్రబాబు వివరించినట్లు సమాచారం. అదే విధంగా ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను సైతం సీఎం హోదాలో చంద్రబాబు గవర్నర్‌కు వివరించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అందుకు సంబంధించిన కేసులపై తీవ్ర రాజకీయ దుమారం రేగుతుంది. ఆ క్రమంలో నిందితులను అరెస్ట్ చేసిన అంశాలతోపాటు చట్టపరంగా వారిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను సైతం గవర్నర్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కానీ, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు కానీ ఈ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా, అనే సందేహం సర్వత్ర వ్యక్తమవుతుంది. ఈ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని వైసీపీ నిర్ణయించినట్లు ఓ చర్చ నడుస్తుంది. ఈ అంశాలన్నింటిపై కూడా గవర్నర్‌తో సీఎం చంద్రబాబు చర్చించారని తెలుస్తుంది.

## తగ్గిన కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు

మొదటి పేజీ తరువాయి...

వ్యవహార మంత్రిత్వ శాఖ నివేదికను కోట్ చేస్తూ మాజీ మంత్రి హరీష్ రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజా నివేదిక ప్రకారం 2023–24తో పోలిస్తే 2024–25 జూల్కె నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు తెలంగాణలో గణనీయంగా తగ్గినట్టు వెల్లడిరచిందని తెలిపారు. ఈ తగ్గుదల రాష్ట్ర మూలధన పెట్టుబడులపై ప్రభావం చూపిస్తూ, ఉద్యోగ అవకాశాలు తగ్గడం, తద్వారా ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్లు క్షీణించిందని తెలిపిందన్నారు. ఇది తెలంగాణ ఆర్థిక అభివృద్ధికి గొడ్డలి పెట్టు అంటూ ఆయన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్టార్టప్ తెలంగాణ వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పు కుంటుందని, కానీ వాస్తవాలకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయన్నారు. కొత్త కంపెనీల సంఖ్య పడిపోవడం, లక్ష్యాన్ని చేరుకోకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలంగాణలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కోల్పోవడమే కాక ఆర్థిక అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని చెప్పుకొచ్చారు. ఇదీ తెలంగాణలో కాంగ్రెస్ తెచ్చిన అసల్కెన మార్పు అంటూ హరీష్ రావు పోస్టు చేశారు.

# అక్రమ నిర్మాణాలు పై గళమెత్తిన కౌన్సిల్

- వారం లోగా సంయుక్తంగా సర్వే చేద్దామన్న మున్సిపల్ కమిషనర్
- సభ్యుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి






**ప్రొద్దుటూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** కౌన్సిల్ సమావేశంలో వచ్చిన సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని ఆక్రమణను అడ్డుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ భవనంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 11 అంశాలతో నిర్వహించిన ఈ సమావేశంలో 10 అంశాలు ఆమోదం పొందగా, ఒక అంశాన్ని రద్దు చేశారు. ఈ సమావేశంలో పలువురు సభ్యులు వారి వార్డులలోని సమస్యలను కౌన్సిల్ ముందుకు తీసుకు వచ్చారు. 3వ వార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్షుమ్మ తమ వార్డులోని మెడినోవా సమీపంలోని మడూరు కాల్వలో షీల్డ్ ను సరిగ్గా తొలగించ లేదన్నారు. స్పందించిన కమిషనర్ పూర్తిగా తొలగించారని వివరించారు. 33 వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి తమ వార్డులో కుక్కల బెడద అధికంగా ఉందని, ఎస్.వి.వి. బాయ్స్ హైస్కూల్ దగ్గర మున్సిపల్ స్థలాన్ని ప్రవేట్ వ్యక్తులు ఆక్రమించే యత్నం చేస్తున్నారని తెలపగా, కమిషనర్ స్పందిస్తూ కుక్కల బెడద నివారణకు కృషి చేస్తామని, ఎస్.వి.వి.స్కూల్ సమీపంలోని స్థలాన్ని పరిశీలించి తగు రక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాష తమ వార్డులో అక్రమంగా నిర్మిస్తున్న భవనంపై చర్యలు తీసుకోవాలని కోరగా, మున్సిపల్ కమిషనర్ నవంబర్ 4 వ తేదీ జాయింట్ సర్వే చేయిస్తామని తెలపగా, కౌన్సిలర్ సంతృప్తి చెందక పోవడంతో చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి కల్పించుకొని జాయింట్ సర్వే వరకు పనులు నిలిపివేసి, పూర్తి చేసి ప్రభుత్వ స్థలం ఐతే చర్యలు తీసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగరాజు త్వరలోనే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్ మల్లికార్జున పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై గతంలో 18 భవనాల విషయమై న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లగా వాటికి దాదాపు 3.18 కోట్ల రూపాయల ఫెనాల్టీ విధించారని, మరో 20 బిల్డింగ్ లకు కూడా మరో మూడు కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం వుందని తెలిపారు. వైస్ ఛైర్మన్ ఖాజామోహిద్దీన్ మున్సిపల్ పార్క్ లో వాటర్ ఫౌంటెన్ ఎందుకు వినియోగంలో లేదని ప్రశ్నించగా అధికారులు స్పందిస్తూ అక్కడ నైట్ వాచ్మెన్ లేక పోవడం వలన ఫౌంటెన్ లోని వస్తువులు అపహరణకు గురయ్యాయని, త్వరలోనే వినియోగంలోకి తెస్తామని వివరించారు. ఛైర్ పర్సన్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నైట్ వాచ్మెన్ ను కానీ, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి గాని అక్కడ విధులు వేయాలని కోరారు. 17వ వార్డులో అక్రమ నిర్మాణాలపై చింతకుంట సరిత మరోసారి కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తూ, తమకు తెలియకుండానే సర్వే ఎలా చేయించారని ప్రశ్నించారు. ఏసిపి నాగరాజు మాట్లాడుతూ ఆ వార్డులో సర్వే జరిగిందని తెలిపారు. మరో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఎగ్జిబిషన్ గుత్తేదారులు గెజిట్ పాటించడం లేదని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన కమిషనర్ అధిక ధరలకు విక్రయాల పై విచారణ చేయిస్తున్నామన్నారు. అదే విధంగా మున్సిపాలిటికి మొత్తం డబ్బు చెల్లించారా అని వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు రెడ్డి అడుగగా కమిషనర్ 1.50 కోట్ల రూపాయలు చెల్లించారని, మిగిలిన మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, గతంలో కూడా పలువురు జీఎస్టీ బకాయి పడ్డారని వారి నుండి కూడా రికవరీ చేస్తామని వివరించారు. కౌన్సిలర్ కమాల్ బాష మాట్లాడుతూ కేవలం ఒక ఎగ్జిబిషన్ విషయమే కాకుండా మున్సిపల్ అధికారులు అన్ని విషయాలలో గెజిట్ పాటించి తీరాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా ఆ విధంగా స్థలాలు ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తెలిపే సమస్యలను తప్పనిసరిగా వచ్చే కౌన్సిల్ సమావేశం లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు.

## కామాక్షి పురంలో కార్పొరేటర్ పర్యటన



**రామంతాపూర్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** రామంతపూర్ డివిజన్ కామాక్షి పురంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి మున్సిపల్, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. యుజీడి పైప్ లైన్, వర్షపు నీరు లైన్ కు సంబంధించి, వివిధ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో ఉన్న సమస్యలను అధికారులకు తెలియజేసి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయవలసిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎఈ రవీందర్, మున్సిపల్ డి.ఈ.నాగమణి, మేనేజర్ కిషన్ సూపర్వైజర్ మహేందర్ కాలనీ సీనియర్ నాయకులు చింతోజు శ్రీనివాస చారి, కాలనీ అధ్యక్షులు దుర్గేష్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు, తమ్మలి రవి, పలుగుల అంజయ్య పటేల్, అడ్వకేట్ నరసింహ, శంకర్ రెడ్డి, కల్మకల్ల లింగం, ఫోటో రవి లక్ష్మణ్, వెంకటేష్ కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

### మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు




**మర్రిపాడు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మర్రిపాడు ఎస్ ఐ శ్రీనివాసరావు తెలిపారు. గంగుంట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్నా రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకునట్లు అయన మర్రిపాడు స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో తెలిపారు. ద్విచక్ర వాహనలు దొంగలిస్తున్న వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్న మర్రిపాడు పోలీస్ సిబ్బందిని ఎస్పీ కృష్ణ క్రాంత్ అభినందించారు.

## మార్కండేయ శివాలయం ముఖద్వారానికి భూమి పూజ



**రామంతాపూర్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** రామంతపూర్ ఇందిరానగర్ మార్కండేయ శివాలయం ముఖ ద్వారానికి డి మార్ట్ దగ్గర ఉప్పల్ కాంగ్రెస్ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం రఘు, పద్మశాలి సంఘం అధ్యక్షులు చిక్క సత్యనారాయణ కార్యదర్శి గుండ్ల రవీంద్రకుమార్ కోశాధికారి గజం మురళి సహాయ కార్యదర్శి రాపోలు శేఖర్ చైర్మన్ జన్ను వెంకటయ్య, వనం యాదగిరి తౌఫిక్ రఫీక్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఉపేందర్ రెడ్డి, నామ్ రాజ్ రెడ్డి గరిక సుధాకర్ పూససత్యనారాయణ సందీప్ ,భాస్కర్ సతీష్ గౌడ్, జిల్లు సాయి యాదవ్ శోభ సంధ్య రాణి, అంబికా శోభ, గాయిత్రి నయీమ్ అరుణ్ సాయి సభ్యులు రాపోలు భిక్షమయ్య వర్కలా పెంటయ్య అలె రమేష్ చెన్న వీరేశం గంజి వెంకటేశం సకినాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల కు చీరల పంపిణీ



**సైదాబాద్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని పెద్దమ్మ తల్లి ఆలయ ధర్మకర్త చిలుకూరి రామిరెడ్డి తెలిపారు. మంగళవారం శంకేశ్వర్ బజార్ లోని ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కమిటీ సభ్యులతో కలిసి పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. అమ్మవారి పూజలకు భక్తులు సమర్పించిన చీరలను కార్మికులు నిరుపేద మహిళలకు అందజేశారు.

## థింకింగ్ కొలాబ్రేషన్ అంశంపై గెస్ట్ లెక్చర్



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో వున్న సాయి రాజేశ్వరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం హైదరాబాద్ బెల్ రిటైర్డ్ డిజిఎం ఉమామహేశ్వర రెడ్డి విద్యార్థులకు ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో థింకింగ్, కొలాబ్రేషన్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఉమామహేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఇన్నోవేషన్ ఐడియాల గురించి వర్క్ ఎక్స్ పీరియన్స్ తదితరాల గురించి తెలిపారు. ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి మాట్లాడుతూ ఒక సక్సెస్ ఫుల్ ఇన్నోవేటర్ గా ఎదగాలంటే మంచి టీం వర్క్, వర్క్ కల్చర్ విద్యార్థి దశలోనే అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, హెచ్ఓడిలు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చు కోకండి

- దీపావళిని ప్రమాద రహితంగా జరుపుకోండి
- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జే మోహనరావు



**శ్రీకాకుళం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** కుల మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ జరుపుకొనే పండుగ దీపావళి అని ఈ పండగను ఆనందంగా ఆహ్లాదకరంగా సంతోషంగా జరుపుకోవాలని శ్రీకాకుళం జిల్లా అగ్నిమాపక శాఖ ప్రధాన అధికారి జే.మోహనరావు అన్నారు. దీపావళి పండగ సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గత వారం రోజులుగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రమాద రహిత దీపావళి పర్యావరణ పరిరక్షణ రహిత దీపావళి చేయటం తమ లక్ష్యమని అన్నారు.మంగళవారం శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడుతూ దీపావళి పండగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని,పిల్లలు బాణాసంచా కాల్చిన సమయంలో పెద్దలు పక్కనే ఉండాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల పరిధిలో 94 బాణాసంచా దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్ లు మంజూరు చేయడం జరిగిందని, అనధికారికంగా మందుగుండ అమ్మే వారిపై పోలీస్ శాఖతో కలిసి వెళ్ళి దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన బాణాసంచా మాత్రమే వినియోగించాలని, సరదా కోసం నిండు జీవితాలను నాశనం చేసికోవొద్దు అని సూచించారు. కాటన్ దుస్తులు ధరించి, నీటి నిల్వలు సిద్ధం చేసుకొని, బాణాసంచా కాల్చాలని మోహనరావు సూచించారు. మందుగుండ విషయంలో అజాగ్రత్త వహిస్తే జీవితాలు నాశనం అవుతాయని ఇది గ్రహించి ప్రతీ ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# డాక్టర్ ఏఎస్ రావు జీవిత చరిత్ర చిత్ర ప్రదర్శన

### ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ ప్రభుదాస్



**మౌలాలి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** డాక్టర్.ఏఎస్ రావు విజ్ఞాన వేదిక విజ్ఞాన దర్శిని వారి ఆధ్వర్యంలో హెచ్ బి కాలనీ ఫేస్-2 గ్రౌండ్ లో సెయింట్ పాల్స్ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ ఏఎస్ రావు జీవిత చరిత్ర చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు నిరుపేద కుటుంబంలో జన్మించి ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని మన ప్రాంతంలో ఉన్నటువంటి ఈసీఐఎల్ కంపెనీని స్థాపించి దేశానికే గొప్ప పేరు తీసుకొచ్చారని ఆయన జీవిత చరిత్రను చూసిన ప్రతి విద్యార్థికి తన జీవితంలో ఆయన చేసిన సేవలను, ఆయన జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ఎంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అయ్యగారి సాంబశివ రావు (ఏఎస్ రావు) (1914-2003) ఒక భారతీయ శాస్త్రవేత్త, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కంపెనీ వ్యవస్థాపకులు అని ఆయన సేవలు గుర్తు చేశారు. ఆయన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి దేశానికి ఎనలేని సేవ చేశారని మనం ప్రస్తుతం ఎన్నికలలో వాడుతున్న ఈవీఎం మిషన్స్ ఈ కంపెనీ ద్వారానే తయారు చేయబడ్డాయని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి కూడా ఆయన మార్గంలో నడుస్తూ ఆయనను ఆదర్శంగా తీసుకొని మీ జీవితాలలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నసీమా, పాఠశాల నిర్వాహకులు సత్యారెడ్డి, విజ్ఞాన దర్శిని ఏఎస్ రావు విజ్ఞాన వేదిక నిర్వాహకులు రమేష్, ఏఎస్ రావు విజ్ఞాన వేదిక అధ్యక్షులు యాదగిరి, హెచ్ బీ కాలనీ ఫేజ్-2 అధ్యక్షులు వెంకటాచారి, స్థానిక నాయకులు జగదీశ్, వెంకటేశ్, చంద్ర మోహన్, నరేందర్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

# అమృత నగర్, మడూర్ రోడ్డును పూర్తి చేయండి: సిపిఎం



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** అమృత నగర్ నుంచి మడూర్ రోడ్ లో కలిసి పోయే రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ కోరారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ అమృత నగర్ నుంచి మడూరు రోడ్డులో కలిసే రోడ్డులో మొత్తం సిమెంటు రోడ్డు వేసి మధ్యలో దాదాపుగా వంద మీటర్లు సిమెంట్ రోడ్డు వేయకుండా ఆపారు. దాని కారణంగా ఆ దారిలో పోయే ఆటోలు మోటర్ బైకులు వర్షం వస్తే చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు మోటార్ వెహికల్ లో పోయేవారు చాలామంది కిందపడి గాయాలు పాలవుతున్న దృశ్యాన్ని మనం చూస్తున్నాము దాదాపుగా ఆ రోడ్లో వందలాది మంది ప్రజలు, వాహనాలు తిరుగుతుంటాయి అటువంటి రోడ్డును బాగు చేయడంలో సంబంధిత అధికారులు ఓట్లు వేయించుకొని గెలిచిన పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు ఆ రోడ్డుకు సంబంధించి ఎవరైనా భూమిగల యాజమానులు అడ్డుపడుతుంటే వారితో అధికారులు మాట్లాడి ఆ భూమి కి సంబంధించిన వారికి డబ్బులు ఇచ్చి సమస్య పరిష్కరించాలని అన్నారు. లేకపోతే ప్రభుత్వానికి సంబంధించిన రాజీవ్ స్వగృహ భూమిలో నుంచి రోడ్డు వేయాలని తెలిపారు లేనిపక్షంలో సంబంధిత ఆఫీస్ వద్ద అమృత నగర్ ప్రజలను కలుపుకొని ఆందోళన చేపడతామని అన్నారు ఈ ప్రెస్ మీట్ లో సిపిఎం సుందరయ్య నగరు ఏరియా కార్యదర్శి పి.శేఖర్ మడూర్ రోడ్ ఆటో శాఖ కార్యదర్శి ఆటో యూనియన్ నాయకులు శివ గౌస్ పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గాంధీ విగ్రహ

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన గాంధీ గ్లోబల్ ప్రతిష్ట జిల్లా కార్యదర్శి పాలకుర్ల వెంకటేశం



**వలిగొండ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం గాంధీ విగ్రహానికి గాంధీ గ్లోబల్ జ్ఞాన ప్రతిష్ట జిల్లా కార్యదర్శి పాలకుర్ల వెంకటేశం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్ముడు ఆలోచనలతో ప్రతిబింబిచేలా అతిపెద్ద విగ్రహం హైదరాబాదులో ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ మండల అధ్యక్షులు కాసుల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, కనకల కిష్టయ్య, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బెలిదే నాగేశ్వర్, మాజీ సర్పంచ్ ప బ్బు ఉపేందర్ బోస్, ప్రముఖ వ్యాపారవేత్త కాంగ్రెస్ నాయకుడు కొండూరు భాస్కర్, జిల్లా సీనియర్ నాయకుడు ఈ తాప రాములు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, గంజి నారాయణ, బచ్చు శ్రీనివాస్, బోగిపర్తి సంతోష్ కుమార్, అప్పిశెట్టి సంతోష్ కుమార్, గజ్జెల అమరేందర్, శ్రీనివాస్, నువ్వుల శ్రీనివాస్, ఎమ్మె మల్లేశం తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

### హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల ఉప్పల్ లో జరిగిన అండర్ 14 అండ్ 17 జిల్లా స్థాయి కబ్బడ్డి టోర్నమెంట్ ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు ఉప్పల్ ప్రాతినిధ్యం వహించడం సంతోషం అని విద్యార్థులు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు సమాజానికీ మంచి పేరు తీసుకు రావాలని ఆయన అన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాఠశాల హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు, పి.డి. పద్మావతి, రమేశ్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, ముష్యం శ్రీను, మేకల మధుసూధన్ రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ రమేశ్ గుప్త, బాల కృష్ణ, సుక్క కిరణ్, నిరంజన్, శేఖర్ రాంరెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా.. టపాకాయలు విక్రయిస్తే కేసులు తప్పవు



**మర్రిపాడు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మర్రిపాడు మండల పరిధిలో ఉన్న టపాసుల దుకాణాల యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని మర్రిపాడు ఎస్సై కాసుల శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ పొందిన టపాకాయల దుకాణ యజమానులు ఫైర్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సదర్ వేడుకలకు భారీ ఏర్పాట్లు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆహ్వానం



**సైదాబాద్, అక్టోబర్ 29 (నిఘు న్యూస్):** సైదాబాద్ లో నిర్వహించనున్న సదర్ వేడుకలకు రావాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్ కోల్ మహేందర్ యాదవ్ కేంద్రమంత్రిని ఆహ్వానించారు. నవంబర్ 1న సైదాబాద్ సదర్ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా సాగుతాయని కిషన్ రెడ్డికి వివరించారు.కాగా ఉత్సవాలు ఏటా ఘనంగా నిర్వహించినట్లు మహేందర్ యాదవ్ తెలిపారు.

## ఈసీఐఎల్ ఆసుపత్రి ప్రారంభం



**కాప్రా, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** కుషాయిగూడ ఇసీఐఎల్ ఎక్స్ రోడ్‌లోని లైఫ్ లైన్ తులసి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, నేమూరు మహేష్ గౌడ్, డా.ఎనుముల శ్రావణ్, డాక్టర్ ఆర్ మదన కుమార్, క్రిటికల్ కేర్, డాక్టర్ కే రామచంద్రరావు డాక్టర్.ఏ.వరుణ్ తేజ, డాక్టర్.కే.సాయి వివేక్ ఇందుమతి, శ్రీనివాస్ రెడ్డి హాస్పిటల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా.. వ్యాధులను నయం చేస్తున్న ఆయుర్వేదం

## ఘనంగా తొమ్మిదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం



**శ్రీకాకుళం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ఆయుర్వేదం సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వ్యాధులని నయం అవుతాయని సీనియర్ వైద్యాధికారి డాక్టర్.పి.జగదీష్ అన్నారు. అక్టోబర్ 29న తొమ్మిదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం, శ్రీకాకుళం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయుర్వేద మూల పురుషుడైన శ్రీభగవాన్ ధన్వంతరీ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు వేసి జయంతి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యాధికారి డాక్టర్.పి.జగదీష్ మాట్లాడుతూ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ధన్తేరాస్, ధనత్రయోదశి రోజున వైద్య దేవుడైన ధన్వంతరి జయంతిగా ప్రతిసంవత్సరం జరుపుకుంటున్నమన్నారు. ధన్తేరాస్, ధనత్రయోదశిని భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో దీపావళి పండుగను గుర్తించే మొదటి రోజుగా భావిస్తారు. భారత ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ 2016లో ఈ రోజును జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా ప్రకటించింది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ వారి ఆదేశాల మేరకు తొమ్మిదవ, జాతీయ ఆయుర్వేద దినోత్సవం పరష్కరించి గత ఎనిమిది రోజులు నుండి వివిధ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. "ఆయుర్వేద ఫర్ గ్లోబల్ హెల్త్ " అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం వారు తొమ్మిదో జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించమని ఆదేశాలు జారీ చేశారు. ఆయుర్వేదం వైద్యం, భారతీయ సంస్కృతి, సాంప్రదాయం, జీవన విధానంలో భాగం. మనిషి నిత్య జీవితంలో ఆందోళన, మెకానికల్ లైఫ్ కారణంగా శారీరక, మానసిక వ్యాధులకు గురి కావడం జరుగుతుంది. మనిషి నిత్యం యోగ చేయడం, జీవన శైలిని క్రమ పద్ధతిలో అవలంబించడం వలన వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండగలం. దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం చక్కటి పరిష్కారం మార్గం ఆయుర్వేద మందులు వాడే సమయంలో పత్యం పాటించాలని, వేడి చేస్తాయి అనేది అపోహ మాత్రమే. ఇవి హెర్బల్ ప్రిపరేషన్స్, శరీరంపై ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వ్యాధులని నయం చేస్తాయి.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కాంపౌండ్, ప్రాంగణంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాల ఈ మధ్య ఉన్నతీకరించబడి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, వెల్నెస్ సెంటర్ గా అప్డేట్ చేయబడింది. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించుట కోసం సీనియర్ వైద్యాదికారి అందుబాటులో ఉన్నారు. యోగా నేర్పించుటకు ఇద్దరు ఇన్ ష్ట్రక్టర్లు అందుబాటులో ఉన్నారు. ఔషధ మొక్కలపై అవగాహన కల్పించడం కోసం హెర్బల్ గార్డెన్ నిర్మించడం జరిగింది. రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించడం వలన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ వారిచే వైద్యశాల గుర్తింపు పొందింది. ఈ జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి బలివాడ మల్లేశ్వరరావు, ఆయుష్ కాంపౌండర్ జాడ చంద్రశేఖర రావు , కొంక్యాన మురళీ వాకర్స్ ప్రెసిడెంట్ యోగ మురళి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# మూసి అభివృద్ధిపై అఖిలపక్షాన్ని పిలవండి

- బస్వాపూర్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ డిమాండ్




**వలిగొండ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో దేవిశ్రీ ఫంక్షన్ హాల్ లో మూసి ప్రాంతాన్ని ప్రత్యేక జోన్ గా గుర్తించి నిధులు విడుదల కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం మండల ఎనిమిదవ మహాసభ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య కూర శ్రీనివాస్ ల అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో మూసి జల కాలుష్యాన్ని అరికట్టేందుకు ఎన్ని ఎస్టీపీలు పెడతారో ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మూసి పట్ల మూసి ప్రాంత ప్రజల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న మూసి ప్రాంతాన్ని స్పెషల్ జోన్ గా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించి ఈ ప్రాంత ప్రజలకు మూసి జల కాలుష్యం నుండి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. మూసి విషయంలో ప్రభుత్వం వెంటనే అఖిలపక్షాన్ని పిలవాలని డిమాండ్ చేశారు. మూసిని కాలుష్యం చేస్తున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బస్వాపూర్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించిందని బస్వాపురం ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారు అనేది ప్రభుత్వం దగ్గర స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. బస్వాపూర్ ప్రాజెక్టు పనుల పూర్తి కోసం సిపిఎం ఒక్కరోజు దీక్ష చేపట్టబోతుందని తెలిపారు. ఈ మహాసభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ బట్టుపల్లి అనురాధ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పిఎన్ఎమ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ ఈర్లపల్లి ముత్యాలు పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, చీర్క శ్రీశైలం రెడ్డి మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, కలుకూరి రామచందర్ మండల కమిటీ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి కందడి సత్తిరెడ్డి,గాజుల ఆంజనేయులు, మొగిలిపాక గోపాల్,కొండే కిష్టయ్య, ఏలే కృష్ణ,కలుకూరి ముత్యాలు, కవిడే సురేష్, బుగ్గ చంద్రమౌళి దుబ్బ లింగం, భీమనబోయిన జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ లక్ష్మయ్య అకాడమీలో సివిల్స్ ఉచిత శిక్షణ

## టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలో ప్రతిభ ఉన్నా ఆర్థిక స్తోమత లేని యువతులకు న్యూఢిల్లీ వారి డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్ ఉచిత శిక్షణ అందించనున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ ఆలోచనల మేరకు ధర్మవరం నియోజకవర్గంలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది యువతులకు సివిల్స్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. మంత్రి సత్య కుమార్ ప్రోత్సాహంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూడా ఆర్థిక స్తోమత లేని ప్రతిభగల విద్యార్థినిలకు ప్రోత్సాహం అందించి మరింత మందిని సివిల్స్ టాపర్లుగా నిలిపేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వంటేరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి పోటీ పరీక్షలలో ప్రొద్దుటూరు విద్యార్థులు ప్రతిభ చూపుతున్న సంగతి తెలిసిందే అన్నారు మరింత మందిని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు టిడిపి నాయకులు నంద్యాల కొండారెడ్డి డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ వారి శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తున్న ఆయనకు అభినందనలు తెలిపారు. సివిల్స్ శిక్షణ పొందే యువతులు నవంబర్ మూడవ తేదీ స్థానిక కామిశెట్టి డిగ్రీ కళాశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల యువతులు క్రింది నెంబర్లకు సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఒంటేరు శ్రీనివాసరెడ్డి- 98856099, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి - 9985061155ను సంప్రదించాలని కోరారు.

# పటాకులు పేల్చే సమయంలో ఆరోగ్య జాగ్రత్తలు

## శిశు వైద్య నిపుణులు డా.వివేక్ షేరికర్



**తాండూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** చిన్నారులు పటాకులు పేల్చే సమయంలో తల్లిదండ్రులు చిన్నారుల విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని చిన్నారుల వైద్య నిపుణులు డాక్టర్ వివేక్ షేరికర్ వెల్లడించారు. మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా దీపావళి పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని వారు దీపావళి పండుగ ప్రాముఖ్యతను తెలిపారు. తాండూరు పట్టణ కేంద్రంలోని ఓం సాయి చిన్న పిల్లల ఆసుపత్రిలో వారు చిన్నారులకు వైద్య సేవలు అందించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలు పటాకులు (బాణసంచా) పేల్చే సమయంలో చిన్నారుల తల్లిదండ్రులు దగ్గరుండి చిన్నారుల చేతికి బహు దూరంగా పటాకులు పేల్చే విధంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చేతులలో పటాకులు పేలితే తీవ్ర ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉందని సూచించారు. అదేవిధంగా ఇళ్లలో పటాకులు వెలిగించకుండా ఖాళీ ప్రదేశంలో ఇండ్లకు దూరంగా పటాకులు వెలిగించడం ఉత్తమం అన్నారు. అలర్జీ ఉన్నవారు పటాకులు పేల్చే సమయంలో దూరంగా ఉండడం శ్రేయస్కరమని హితవు పలికారు. పర్యావరణానికి ముప్పు కలిగించకుండా తక్కువ మొత్తంలో పటాకులు వెలిగించడానికి కృషి చేయాలన్నారు.

# విద్యార్థినిలకు రోటరీ క్లబ్ సైకిళ్ల పంపిణీ



**నరసరావుపేట, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** పల్నాడు జిల్లా నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్, వెల్జాన్ ప్రాజెక్ట్ సహకారంతో మంగళవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కపిలవాయి రాజేంద్రప్రసాద్, ట్రెజరర్ కట్టమూరి ఆంజనేయులు, రోటరీ క్లబ్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ ఎస్.కె.జిలాని మాలిక్, రోటరీ డైరెక్టర్లు పోటు అచ్యుత్, పులిపాటి రమేష్, రాచకొండ ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో చదివే బాలికలు,దూర భారం వల్ల తమ చదువులను, మానుకో వద్దనే ఉద్దేశంతో 23 సైకిల్ లను షుమారు లక్ష పదిహేను వేల రూపాయలు విలువైన సైకిల్ లను పంపిణీ చేయడం జరిగిందని,స్కూల్ కి ఇంటికి మూడు కిలో మీటర్ల దూరం నుంచి వచ్చే కొంత మంది గ్రామీణ విద్యార్థునులకు కూడ ఈ సైకిళ్లు అందజేశామని తెలిపారు. అలాగే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో కలిపి డిస్టిక్ 3150 వ్యాప్తంగా 37 క్లబ్ లకు మొదటి విడతగా 240 సైకిళ్లను అందజేయడం జరిగిందని, రెండో విడతగా త్వరలో 260 సైకిల్ లను ఇవ్వటం జరుగుతుందని, సైకిల్ పంపిణీ ప్రాజెక్ట్ విషయంలో సహకరిస్తున్న వి.జనార్దన్ రావు, ప్రాజెక్టు కన్వీనర్ హరిహర ప్రసాద్ లకు అభినందనలు తెలియజేశారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక




**బాలాపూర్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ఏళ్లనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్న నేటి హోదాలు మరిచి బాల్య మిత్రులతో కలిసి కోలాహలంగా మారిన నాదర్ గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్య మిత్రులు కలిస్తే ఎంత ఆనందంగా గడుపుతారో నేటితరం యువత చూడాల్సిన మధుర ఘట్టం నాదర్ గుల్ జడ్పీహెచ్ఎస్ లో జరిగింది. 1997-98బ్యాచ్ కు చెందిన పదవ తరగతి విద్యార్థులంతా ఒక్కచోటకు చేరి సందడి చేశారు. అప్పటి ఇంగ్లీష్ మాస్టర్, హిందీ టీచర్ కొట్టిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, నాడు చదువులు చెప్పిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. భవిష్యత్ లో తమకు విద్యను అభ్యసించిన పాఠశాలకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# బూరగాంలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం




**శ్రీకాకుళం, అక్టోబరు 29 (నిఘా న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా, మంత్రి అచ్చన్నాయుడు, రామ్మోహన్ ఆదేశాలు మేరకు టెక్కలి మండలం బురగాం పంచాయతీలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బగాది శేషగిరి మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకున్న ప్రతీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా, ఆత్మ గౌరవం ఉంటుందని అన్నారు.ప్రమాద బీమా రూ.5 లక్షలతో పాటు చంద్రన్న భీమా రూ.10 లక్షల ప్రమాద బీమా కలిపి రూ.15 లక్షలు ఆర్థిక సహాయం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గేదెల సంజీవ్ రెడ్డి, జనపాన రూపావతి, జనపాన తేజ, గేదెల రమణయ్య, కోదండ రావు,బురగాం పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వకర్మ దరఖాస్తులను కమిషనర్ కు అందజేసిన బిజేపి



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం కింద నియోజవర్గంలోని మహిళలు, పురుషులు వేలాదిగా దరఖాస్తు చేసుకుంటున్నారని, బిజెపి ప్రొద్దుటూరు అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు ఈ పథకం కింద వచ్చిన 2,906 దరఖాస్తులను సోమవారం మున్సిపల్ కమిషనర్ కు అందజేశారు. ఈ పథకం కింద ప్రతి లబ్ధిదారునికి తగు శిక్షణ ఇప్పించి పథకం ఫలితాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం అధ్యక్షులు సంజీవ్ కుమార్ ,పార్టీ నాయకులు శరత్ బాబు, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కథా రచనలో శిక్షణా శిబిరం




**అంబర్ పేట, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మాడభూషి రంగాచార్య స్మారక కమిటీ ఆధ్వర్యంలో అంబర్ పేట బాపు నగర్ ప్రగతి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులకు కథా రచనలో శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కథల తాతయ్యగా పిలువబడే బాల సాహితీవేత్త డాక్టర్ వి.ఆర్. శర్మ విద్యార్థులకు కథలు ఎలా రాయాలో, అందులోని మెలకువలను వివరించారు. జొన్నలగడ్డ శ్యామల డా.అమరవాది నీరజ, శీల పల్లవి, మాడభూషి లలిత తదితరులు విద్యార్థులకు కథలు రాయడంలో ప్రధాన విషయాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులందరితో కథలను రాయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కథా రచనలో విజేతలైన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, జ్యోత్స్నలు అతిథులను సన్మానించి, విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మధుసూదన్ అడ్మిన్ ఆఫీసర్ సత్యనారాయణ, తెలుగు భాషా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమాన్ చాలీసా పారాయణం

## హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు జెట్ట కిషోర్ నివాసంలో మంగళవారం నిర్వహించిన హనుమాన్ చాలీసా 108 పూజా కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణం చేయడం వల్ల జీవితాన్ని ప్రసాదించటంతో పాటు ఆనందాన్ని, ఉత్సాహాన్ని, విజయాన్ని, సంపూర్ణ కీర్తిని ఆంజనేయ స్వామి అందిస్తాడని అన్నారు. హనుమంతుడిని కొలిస్తే ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా జెట్ట కిషోర్ ఎమ్మెల్యేను సత్కరించారు. హనుమాన్ చాలీసా పారాయణంలో పెద్ద ఎత్తున స్వాములు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

# కానిస్టేబుల్ రాజశేఖర్ కు జాతీయ పురస్కారం



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలానికి చెందిన కానిస్టేబుల్ రాజశేఖర్ గౌడ్ కి యంగ్ ఇండియన్ సేవా పురస్కార్ -2024 యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమం లో ముఖ్య అతిధి తెలంగాణా ఆర్ టి సి మేనేజింగ్ డైరెక్టర్ విసి. సజ్జనార్ అందించటం జరిగిందని క్లబ్ అధ్యక్షులు జె.బాలు తెలిపారు.ఈ సందర్బంగా బాలు మాట్లాడుతూ కానిస్టేబుల్ రాజశేఖర్ యువ ఫౌండేషన్ ద్వారా సమాజ సేవ చేస్తూ యువతను సమాజ సేవలో భాగస్వామ్యం చేస్తూ రక్త శిబిరాలు నిర్వహించడం, యువతను రక్త దానం వైపు ప్రోత్సహించటం, యువతకు పోలీస్ ఆర్మీ కోసం ఉచిత ఫిజికల్ శిక్షణ ఇస్తూ, యువతను సమాజ సేవలో భాగస్వామ్యం చేస్తున్నందుకు గాను ఈ అవార్డు అందిచటం జరిగిందని తెలిపారు. ఈ సందర్బంగా కానిస్టేబుల్ రాజశేఖర్ మాట్లాడుతూ తనకు సహకరిస్తున్న ఉన్నతధికారులకు, యువ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియశారు.

# గుర్తు తెలియని మృతదేహం



**వలిగొండ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నర్సయ్య గూడెం గ్రామంలో గల జోసెఫ్ చర్చ్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకి లభించింది. వెంటనే మృదేహాన్ని విచారణ నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుని వయసు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, పసుపు, నలుపు చెక్స్ గల షర్ట్ ధరించి బ్లూ కలర్ లుంగీ ధరించాడని తెలిపారు. మృతుని సమాచార నిమిత్తం వలిగొండ పోలీస్ స్టేషన్ లో ఫోన్ నెంబర్ 8712662810, 8712662484 నెంబర్లలో సంప్రదించాలని వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ తెలిపారు.

# బాధిత కుటుంబాలను పరామర్శ



**వేములవాడ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** వేములవాడ పట్టణంలో అనారోగ్యంతో మరణించిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పీర్ మహ్మద్ చెల్లెలు సాబేరా బేగం రాజన్న ఆలయ రిటైర్డ్ ఉద్యోగి వెలిచాల రాంచందర్ రావు కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మరియు మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకన్న, నరాల దేవేందర్, పులి రాంబాబు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, పిల్లిశ్రీనివాస్, అన్వర్, నరేందర్, మహేష్, గణేష్ శీలం విజయ్ యాదవ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాప్రస్థానంలో మాజీ ఎమ్మెల్సీ అంత్యక్రియలు

## భారీగా హాజరైన కాంగ్రెస్ నేతలు అభిమానులు

**నల్లకుంట, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.ఇంద్రసేన్ రెడ్డి అంత్యక్రియలు మంగళవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరిగాయి. అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన ఈ నెల 27న కన్ను మూసిన విషయం విధితమే. ఇంద్రసేన్ రెడ్డి మనుమరాలు, ఇతర కుటుంబ సభ్యులు విదేశాల నుంచి రావడంతో ప్రజలు, ఆత్మీయుల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని సోమవారం నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులో గల ఆయన స్వగృహానికి తీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న బంధువులు, సన్నిహితులు, కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఇంద్రసేన్ రెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. అలాగే మంగళవారం మై హోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావు దంపతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. మాజీ ఎంపీ వి.



హనుమంత రావు, మాజీ రాజ్య సభ సభ్యుడు ఎంఏ. ఖాన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్. భాను ప్రసాద్, మాజీ మంత్రి జి.సమ్మాని చంద్రశేఖర్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ అంబర్ పేట నియోజక వర్గం ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి, సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞ శర్మ, బీసీ కమీషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్, టామ్ కామ్ మాజీ చైర్మన్ బి.రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యధర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, కార్యదర్శి అజయ్ కుమార్,టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, ఏపీసీసీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు జేబీ శ్యామ్ రావు, నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత, మాజీ కార్పొరేటర్లు రాంబాబు. పులి జగన్, గరిగంటి శ్రీదేవి రమేష్, సన్ షైన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ గురవా రెడ్డి, రెడ్డి సంఘాల ప్రతినిధులు దేవిరెడ్డి విజితా రెడ్డి, నాయకులు రామ్మోహన్ రావు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇంద్రసేన్ రెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. భారీగా తరలి వచ్చిన ఆత్మీయుల నడుమ జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఇంద్రసేన్ రెడ్డి అంత్య క్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు డాక్టర్ వెంకట ప్రసాద్ రెడ్డి తన తండ్రి ఇంద్రసేన్ రెడ్డి చితికి నిప్పంటించారు. ఈ కార్యక్రమంలో మృతుడి సోదరుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. హరినాథ్ రెడ్డి, ఆనంద దంపతులు, మృతుడి భార్య ఎస్.అరుణ. కుమారుడు వెంకట ప్రసాద్ రెడ్డి, కుమార్తె డాక్టర్ అంజన, కుటుంబ సభ్యులు, మనుమళ్లు, మనుమరాళ్లు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**తాండూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ప్రభుత్వ మద్దతు ధరతో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి వెల్లడించారు. రైతులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాలాల మండల పరిధిలోని అగ్గనూర్ గ్రామ సమీపంలో ఉన్న మారుతి కాటన్ మిల్ దగ్గర సీసీఐ వారు ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్దతు ధరతో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల దగ్గరికి వెళ్లి మోస పోకూడదని సూచించారు. నాణ్యత గల పత్తిని కొనుగోలు కేంద్రానికి తేవాలని వెల్లడించారు. తద్వారా రైతులకు పూర్తిస్థాయిలో మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, మారుతి పత్తి మిల్ యజమానులు మహేందర్ పర్తాని, మహేష్ పర్తాని, సొసైటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ పర్యవేక్షకులు హబీబ్ అల్వి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏ భీమయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## ముద్దాపురం నుండి చిత్తాపురం వరకు కాలువ సర్వే



**వలిగొండ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ముద్దాపురం గ్రామం నుండి చిత్తాపురం గ్రామం వరకు కాలువ సర్వే చేయడం జరిగింది. గంగలోని భావి కుంట వరకు, గంగలోని బాయికుంట నుండి ఊర చెరువు వరకు సర్వే చేయించడం జరిగింది. ఐబి వర్క్ ఇన్స్పెక్టర్ కుమార్ రమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పీసరి వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు, కొంతం ఎల్లయ్య గౌడ్, వల్లమల లక్ష్మి నర్సయ్య, బడక సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ బోడ విజయ్ కుమార్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**వేములవాడ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవొపా ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఆనంద రెడ్డి విద్యార్థులు చదువుతోపాటు ఆటలకు ప్రాముఖ్యత ఇచ్చినప్పుడే శారీరక మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సదానందం మాట్లాడుతూ దీపావళి కానుకగా విద్యార్థులకు క్రీడా దుస్తులు ఇతర వస్తువులు ఇచ్చిన దాతలకు ఉపాధ్యాయులకు, ఇంత మంచి కార్యక్రమానికి సహకరించిన వేములవాడ ఆవోప వేములవాడ యూనిట్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రేష్మ ,13 వ వార్డ్ కౌన్సిలర్ గడ్డమీద లావణ్య, శ్రీనివాస్, అవొపా వేములవాడ యూనిట్ అధ్యక్షులు వంగళ మహేశ్ ప్రధాన కార్యదర్శి ఆమెటి శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ మద్ది సత్యనారాయణ, ఉపాధ్యాయులు ప్రసాద్ లక్ష్మణ్ శ్రీనివాస్ రామస్వామి నీరజ కవిత రాణి పాల్గొన్నారు.


## వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం






**వేములవాడ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి ఆధ్వర్యంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎజెండాలో పొందుపరిచిన 26 అంశాలను, టేబుల్ ఏజెండా 8 అంశాలను గౌరవ పాలకవర్గ సభ్యులు కోఆప్షన్ సభ్యులతో చర్చించి అన్ని అంశాలను ఆమోదించారని తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మిషన్ భగీరథ నీరు మురికిగా వస్తున్నాయని చైర్ పర్సన్ దృష్టికి తీసుకరాగా సమస్యను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. విలీన గ్రామాల్లో వివిధ వార్డులలో పట్టణంలో చేయవలసిన పలు అభివృద్ధి పనులపై సానిటేషన్ పరంగా చేయవలసిన పనులపై గౌరపాలకవర్గ సభ్యులు చర్చించారు,ఈ సమావేశంలో కమిషనర్ సంపత్ రెడ్డి ,వైస్ చైర్మన్ బింగి మహేష్, పాలకవర్గ సభ్యులు కోఆప్షన్ సభ్యులు, డి ఈ వరుణ్, ఏఈ నరసింహస్వామి, నర్మద టీపిఓ అన్సర్,సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థలో ఘనంగా ఆయుధపూజ



**తిరుపతి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** తిరుపతి నగరపాలక సంస్థలో మంగళవారం ఆయుధపూజ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొని అమ్మవారికి, నగరపాలక సంస్థ వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ వాహనాలను జాగ్రత్తగా నడపాలని, అందరూ ఆయురారోగ్యాలు కలిగి ఉండాలని అన్నారు. ఈ ఆయుధపూజ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్,రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, మేనేజర్ హసీమ్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగిపై మున్సిపల్ చైర్మన్ భర్త దాడి

## పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ ఉద్యోగి జయరామ్ సాగర్



**పెబ్బేరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగులపైన చేయి చేసుకునే హక్కు ఎవరికి లేదని కొత్తకోట మున్సిపల్ 13వ అధికారి ఎన్.జయరామ్ సాగర్ అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని మున్సిపల్ చైర్మన్ భర్త పొగకు విశ్వేశ్వర్ అధికారులపై ఒత్తిడి చేసి సాటి ఉద్యోగుల ముందు కొట్టడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగి జయరాం మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 13వ వార్డుకు చెందిన భాస్కర్ రెడ్డి ఇల్లు మోటేషన్ విషయంలో మున్సిపల్ చైర్మన్ భర్త విశ్వేశ్వర్ ఉద్యోగుల విధులలో కలుగజేసుకుని నిబంధనలకు విరుద్ధంగా చేయలెని పనులను మున్సిపల్ చైర్మన్ భర్త పేరు చెబితే చేయాలని ఒత్తిడి చేస్తూ దుర్భాషలాడి దాడికి కాల్పడ్డారని అన్నారు. స్త్రీ పురుషులు సమానమే అని భారత రాజ్యాంగం ద్వారా ప్రజా సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికల్లో గెలిచిన మహిళలకు అధికారం ఇవ్వకుండా ఆడవారి స్థానంలో, పేరు పెత్తనాల కోసం భర్తలు అధికారం చలాయించడం చట్ట విరుద్ధమని అన్నారు. ఉద్యోగులు తప్పు చేస్తే సామాన్య పౌరులు సైతం పై అధికారుల ద్వారా తగు చర్యలు తీసుకొని శిక్షిస్తున్నారన్నారు. అలాంటిది ఓ మాజీ జెడ్పిటిసి, మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయవలసిన మున్సిపల్ చైర్మన్ భర్త అకారణంగా ప్రభుత్వ ఉద్యోగిపై నీచాతి నీచమైన పదజాలంతో దుర్భాషలాడుతూ దాడికి పాల్పడడం తీవ్ర మనోవేదనకు గురి చేసిందని అన్నారు. నిజాయితీగా పని చేసే ప్రజా ప్రతినిధులే అయితే గత ఐదేళ్ల కాలంలో మున్సిపల్ కార్యాలయంలో ఎందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో మహిళా చైర్మన్ అధికారం కాకుండా కేవలం పురుషాహంకరంతో తమ ఆదిపత్యం చెలాయించుకోవడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిని కొట్టి పోలీస్ స్టేషన్లో మున్సిపల్ ఉద్యోగి లంచ గొండితనానికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేయడంతో, ఉద్యోగి జయరామ్ మున్సిపల్ చైర్మన్ భర్త విశ్వేశ్వర్ పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లుగా పేర్కొన్నారు.

# అవుట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించండి



- ● మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులు
- ● ఏఐటియుసి ఆధ్వర్యంలో కమిషనర్ కు వినతి

**ఖమ్మం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ఖమ్మం కార్పోరేషన్ లో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలోమంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతి పత్రం సమర్పించారు.ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దానవాయిగూడెం నీటిశుద్ధి, సరఫరా కేంద్రం వేరు వేరు ప్రాంతాలలో ఫిల్టర్ బెడ్ ఆపరేటర్స్, పంపు ఆపరేటర్లుగా,లీకేజీ వర్కర్స్,ల్యాబ్ వర్కర్స్, స్వీపర్లుగా గత తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా గుర్తించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.తొమ్మిదేళ్ల కాలం పనిచేసిన తర్వాత కొంత మంది అధికారులు వీరిని తప్పించాలని ప్రయత్నం చేస్తున్నారని వినతి పత్రం తెలిపారు.గతంలో సిపిఐ కార్పొరేటర్ బిజి క్లెమెంట్ కార్పొరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో పైన పేర్కొన్న ఉద్యోగుల గురించి ప్రస్తావించినప్పుడు వారిని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తామని పాలక వర్గం హామీ ఇచ్చిందని కాని ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. వీరికి తొమ్మిది నెలలుగా వేతనాలు కూడా చెల్లించడం లేదని వెంటనే వేతన బకాయిలను చెల్లించాలని వారు కమిషనర్కు విజ్ఞప్తి చేశారు.వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ,తోట రామాంజనేయులు, కార్మికులు మహేష్ బాబు, సిహెచ్ అంజయ్య, నాగరాజు, నవీన్, ఎల్.అజయ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కౌన్సిలర్ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**మేడ్చల్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,12వ వార్డు కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ కురుమ జన్మదినం సందర్భంగా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఊర్జిత -3 క్లబ్ హౌస్ లో నిర్వహించిన జన్మదిన వేడుకలల్లో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు, నిరు పేదలకు సాయిపేట శ్రీనివాస్ అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్స్ నడికొప్పు నాగరాజు, ముదిరాజ్,బత్తుల శివ కుమార్ యాదవ్,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,కౌడే మహేష్ కురుమ,మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు కురుమ,మేడ్చల్ మండల మాజీ జెడ్పిటిసి సభ్యురాలు శైలజా హరినాథ్,మేడ్చల్ పట్టణ మాజీ వార్డు మెంబర్ కౌడే నాగేందర్ కురుమ,మేడ్చల్ పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు నాచారం బాల మల్లేష్ యాదవ్,మేడ్చల్ పట్టణ కురుమ సంఘం నాయకులు ఒగ్గు వినోద్ కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గర్ధాస్ నరేందర్,మేడ్చల్ జిల్లా ఎన్ ఎస్ యూ ఐ కార్యదర్శి లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,యూత్ కాంగ్రెస్ నాయకులు నడికొప్పు రంజిత్ ముదిరాజ్,రేగు సాయికిరణ్ కురుమ,బ్రహ్మ రెడ్డి,సాయిరాం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# పేద వృద్ధులకు చేయూత

## కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి గంగాధర్



**డోర్నకల్, అక్టోబర్ 28 (నిఘా న్యూస్):** ప్రభుత్వం మిస్తున్న ఆసరా పథకమే ఆధారంగా జీవిస్తున్న నిరుపేద వృద్ధ కుటుంబానికి పెద్ద కొడుకులా అండగా నిలబడ్డాడు. మండల పరిధి హన్య తండాలో భూక్య దేవా కిమిని వృద్ధ దంపతులకు కాంగ్రెస్ మండల నాయకులు తాళ్లూరి గంగాధర్ నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు డా,రామ చంద్రనాయక్ ఆదేశాల మేరకు ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు. కూడు, గూడుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు తన వంతు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. బాబు ఆశయాలు కొనసాగిస్తానని వెల్లడించారు. ఆ వృద్ధ దంపతులు గంగాధర్ ను ఆత్మీయ ఆలింగణం చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. లచ్చతండలో స్థానికులతో మాటామంతి చేశారు. ఈ కార్యక్రమంలో ఎడమకంటి రవి,వంకాయలపాటి రామారావు, శ్రీధర్, చందా మహేష్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు,దార్ల వీరన్న, మేకపోతుల శ్రీనివాస్ డిజె శ్రీను,లాలు రవి,దేవిసింగ్ వంకాయలపాటి రామారావు నజీరు శ్రీధర్ మహేష్ ఇస్లావత్ వెంకన్న రామ్ లాల్, నరేష్ సాయి, బద్దు, బానోత్ శీను కోబాల్ శీను, గోవిందు, సీత బాపూజీ,జగన్ తదితరులున్నారు.

## ట్రాఫిక్ ఇక్కట్లను తీర్చడానికి రాణా వంతెన నిర్మాణం

### ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ఏజెన్సీ ముఖదారమైన గోకవరం రాణా ఇరుకు వంతెనతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని దానికి త్వరలోనే మార్గం దొరుకుతుందని జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇప్పటికే రాజమహేంద్రవరం విజయనగరం జాతీయ రహదారి 516 (ఈ) గోకవరం మీదగా వెళుతున్న తరుణంలో ట్రాఫిక్ కష్టాలు మరింత ఎక్కువైనాయి. ఈ సందర్భంగా మంగళవారం నాడు కూటమి నాయకులతో కలిసి వంతెనను ఎమ్మెల్యే పరిశీలించినారు. ఈ సందర్భంగా ఏ విధంగా నిర్మాణం చేస్తే గోకవరం ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందో స్వయంగా ఆయన పరిశీలించి తెలుసుకుని ఆర్ అండ్ బి అధికారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరం మీదుగా జాతీయ రహదారి నిర్మాణం అవుతున్న కారణంగా 1905 లో నిర్మాణం కాబడిన వంతెన చాలా పురాతన మైనదని, వాహనదారులు ప్రయాణించడానికి ఇబ్బందులుగా ఉండటంతో, బ్రిడ్జి నిర్మాణం నూతన ప్లానింగ్ అమలు పరచాలని ఆర్ అండ్ బి అధికారులను కోరారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడికి వీడ్కోలు సన్మానం



**పెబ్బేరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** యాపర్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఎండీ.ఖాజా మైనుద్దీన్, ను ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి జయరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ ప్రసంగించారు.ముందుగా శాలువా కప్పి సన్మానించారు. సామాజిక బోధన ద్వారా మాత్రమే తెలుస్తుందని ఉపాధ్యాయుని నిర్విరామ కృషికి వారి వద్ద నేర్చుకున్న విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడమే అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఉపాధ్యాయులు ఎండీ.మైనుద్దిన్ మాస్టారు అని కొనియాడారు. సర్వీసు మొత్తంలో అత్యంత తక్కువ సెలవులు ఉపయోగించిన ఉపాధ్యాయుడిగా అందరి మన్ననలు పొందిన వ్యక్తి అని వారి ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉన్నత విద్యా సేవ అంటే చిట్ట చివరి క్షణం వరకు తరగతి గదిలో బోధన చేయడమే ఆ విషయంలో 100 శాతం విజయం సాధించారని సభలో వక్తలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్రమోని రాములు, మార్కెట్ డైరెక్టర్ మోతే రాములు,పెబ్బేరు పట్టణ పుర ప్రముఖులు పిఆర్టియు యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల పెద్దలు ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అస్సాగోను రాజకీయం చేయొద్దు

### సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**గోకవరం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గుమ్మళ్ల దొడ్డి అస్సాగో ఫ్యాక్టరీని రాజకీయం చేయొద్దని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. స్థానిక ప్రజల ఆవేదన మేరకు శాసనసభ్యుని హోదాలో కూటమి నాయకులను ఫ్యాక్టరీలోనికి తీసుకెళ్లడం జరిగిందని, ప్రజలకు ఉన్నటువంటి ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి షరతులు విధించడం జరిగిందని తెలిపారు. ఆ తర్వాత మాజీ జడ్పీ చైర్మన్ నవీన్ కుమార్ ఫ్యాక్టరీ సందర్శించి అన్ని రాజకీయ పార్టీలతో ఒక కమిటీగా ఏర్పాటు చేయబోయే తరుణంలో కొంతమంది సొంత ఎజెండా కోసం నిరాహార దీక్షలకు దిగడం సమస్యను పక్కదోవ పట్టించడమేనని ఆయన తెలిపారు. అభివృద్ధి పరంగా మెట్ట ప్రాంతం వెనుకబడి ఉందని, ఇప్పుడు పుష్కలంగా నీరు ఉండడంతో ఇప్పుడిప్పుడే పంటలకు అనువుగా మారిందని, సంపూర్ణ అభివృద్ధికి పారిశ్రామికరణ ఎంతో అవసరమన్నారు. మల్లిశాల గ్రామంలో 225 ఎకరాలతో పారిశ్రామిక కారిడార్ కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలో ప్రారంభం కాబోతుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కోసం అహర్నిశలు ఈ ప్రభుత్వం శ్రమిస్తుందని తెలిపారు. స్థానిక ప్రజల ఆందోళన ఆవేదనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని నెహ్రూ అన్నారు.

# రామసముద్రం ఎంపీపీ సర్వసభ్య సమావేశం

### హాజరైన మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష





**రామసముద్రం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మంగళవారం ఎంపీపీ కుసుమ కుమారి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే షాజహాన్ భాష హాజరయ్యారు. అన్ని పంచాయతీల సర్పంచులు ఎంపీటీసీలు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అన్ని శాఖల అధికారుల నుండి ఎమ్మెల్యే షాజహాన్ భాష ఒక్కొక్కరి ద్వారా రివ్యూ తీసుకున్నారు. ప్రధానంగా విద్య వైద్యం పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి,గంగాధర్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్, సీతారామస్వామి,మాజీ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, సర్పంచులు రెడ్డప్ప నాయుడు, ఆదినారాయణ, జమునమ్మ,ఉదయ్ శంకర్ రెడ్డి, ఎంపీటీసీలు ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు రాజస్వామి, రమేష్, మాల మహానాడు అధ్యక్షుడు కృష్ణప్ప, బాలాజీ, జయరాజు, రమణ, జావిద్ భాష,వడ్డెర సంఘ అధ్యక్షుడురెడ్డప్ప, వనపల్లి చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖ అధికారులు ఎంపీడీవో భాను ప్రసాద్, తహసిల్దార్ నిర్మలాదేవి, మండల విద్యాశాఖ అధికారి హేమలత, విద్యుత్ శాఖ అధికారి మస్తాన్ వల్లి, ఏపీవో గౌరీ శంకర్, అన్ని శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులుతదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిజానికి పెరుగుతున్న ఆదరణ

### మోడి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం




**మల్కాజిగిరి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)మల్కాజిగిరి మండల మహాసభ జరిగింది. అంబేద్కర్ భవన్ లో జరిగిన ఈ మహాసభ కు నర్సింగరావ్, మంగ, గుంటి లక్ష్మన్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి ఎర్ర జెండా ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా డీజీ నర్సింహారావు హాజరయ్యారు. సెప్టెంబర్ లో అనారోగ్యం వల్ల చనిపోయిన సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి ఆయన పూల మాల వేసి ఘనమైన నివాలులర్పించారు. అనంతరం మహాసభ నుద్దేశించి వారు ప్రసంగించారు. కమ్యూనిస్టు పార్టీ లు కనుమరుగై పోయాయని చర్చ జరుగుతున్న ఈ రోజుల్లో అంతర్జాతీయంగా అనేక దేశాలు కమ్యూనిజాన్ని కోరుకుంటున్నాయి. శ్రీలంక, నేపాల్, లాటిన్ అమెరికా దేశాల్లో కమ్యూనిస్టు పార్టీ లు అధికారంలో కి వచ్చాయి. అగ్ర రాజ్యం అయిన అమెరికా కంటే చైనా అగ్రగామిగా ఎదుగు తున్నదన్నారు. మరో పక్క రష్యా ఉక్రెయిన్ మధ్య.. ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య భీకర యుద్ధం జరుగు తున్నాయి. యుద్ధాలను వ్యతిరేకించాలన్నారు. ప్రజలు ప్రపంచ శాంతి ని కోరుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారంటీ ల ను అమలు చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలోనే అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం కృపాసాగర్ మూడు సంవత్సరాల రిపోర్ట్ మహాసభలో ప్రవేశపెట్టారు. వీటితోపాటు ఎనమిది తీర్మానాలు కూడా ప్రకటించారు. ఎనిమిది మంది సభ్యులతో నూతన మండల కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యదర్శిగా గుంటి లక్ష్మన్ ఎన్నికైనారు.

# ధర్మారంలో న్యాయ విజ్ఞానంపై సదస్సు

### డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.స్వప్న రాణి




**ధర్మపురి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.స్వప్న రాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా చేయబోయే కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. ఎవరైనా ఒక కక్షిదారుడు తను కోర్టులో కేసు ఉన్నప్పుడు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేనప్పుడు వారు కోర్టుకు మేము న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేదని వినతి పత్రం ఇచ్చినట్లయితే కోర్టు వారికి డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుండి ఒక న్యాయవాదిని వారి తరుపున నియమించడం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ వల్ల జరిగే మోసాలను, వాటి నివారణ గురించి వివరించారు.ఎవరికైనా డబ్బులు వారి వారి అకౌంట్లో నుండి సైబర్ క్రైమ్ వాళ్ళు చోరీ చేసినట్లయితే 1930 నెంబర్ కు డబ్బులు మిస్ అయిన అరగంటలోపు కాల్ చేసినట్లయితే సైబర్ క్రైమ్ పోలీసు వాళ్లు ఆ డబ్బులను సైబర్ క్రైమ్ చోరీ వాళ్లకు దొరకకుండా ఆపుతారని తెలిపారు. అంతేకాకుండా సీనియర్ న్యాయవాదులు డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుండి చేయబోయే కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సర్వీసెస్ చీఫ్ నుంచు శ్రీనివాస్ ,నంది మేడారం అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు నారా అశోక్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఆకారి రాజేశం,సీనియర్ నాయవాదులు హనుమాన్ సింగ్, కుమారస్వామి ఝాన్సీ,డిస్టిక్ లీగల్ ఎయిడ్ సర్వీసెస్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శిథిల వ్యవస్థలో ప్రభుత్వ పాఠశాల

### కొత్త భవనాన్ని మంజూరు చేయండని ఎమ్మెల్యేను కోరిన గ్రామ సర్పంచ్



**రామసముద్రం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మండలంలోని పెద్దకూరపల్లి పంచాయతీ మన్నేవారి పల్లి గ్రామం నందు 1993 వ సంవత్సరంలో ఎంపీపీ పాఠశాల భవనం నిర్మించారు. ఇప్పుడు శిథిల వ్యవస్థలో ప్రభుత్వ పాఠశాల ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.గత ప్రభుత్వంలో కూడా నాడు నేడు కి నోచుకోని పాఠశాల ఈ విషయంపై గ్రామ సర్పంచ్ రెడ్డప్ప నాయుడు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం నందు జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్ భాషా దృష్టికి తీసుకెళ్లారు. ఈ పాఠశాల భవనమును నూతనంగా నిర్మించాలని వర్షం పడిన వర్షపు నీరు పాఠశాలలో చేరుతుందని పైకప్పు నుండి చుక్కల చుక్కలుగా మొత్తం కారుతుందని తెలిపారు. ఈ పాఠశాలలో దాదాపు 20 నుంచి 25 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు.అలాగే అంగన్వాడి భవనం కూడా కావాలని గతంలో వంటగదికి నిర్మించిన భవనంలో పక్కలో ఉన్న టాయిలెట్స్ ఆనుకుని అంగన్వాడి పిల్లలు ఉంటున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే షాజహాన్ భాష పై అధికారులను ఆదేశించారు. పాఠశాలను పర్యవేక్షించి నివేదిక సిద్ధం చేయాలని తెలిపారు. త్వరగా ప్రభుత్వం స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యుత్ భారాన్ని ఆపడంతో బిఆర్ఎస్ సంబరాలు



**మోత్కూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పైన వేయాలనుకున్న 18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వెయ్యకుండా ఆపిన బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున సంబరాలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ మేరకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం మోత్కూరు మున్సిపల్ కేంద్రం లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచ కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు జంగ శ్రీను,మాజీ మార్కెట్ ఛైర్మెన్ కొనతం యాకూబ్ రెడ్డి మాట్లాడారు. పది సంవత్సరాలలో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచని బిఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా కేవలం 10 నెలల్లోనే 18,500 కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్సి ని ఒప్పించగలగడం జరిగిందన్నారు. మొత్తం ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి మొదలుకొని ఇప్పటిదాకా ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని సంపూర్ణంగా చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈ.ఆర్.సి తిరస్కరించడం ఇదే మొదటిసారి అని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించిన ఇలాంటి సందర్భం చారిత్రాత్మకం అన్నారు. రాష్ట్ర ప్రజల పైన అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సరైన పద్ధతిలో శాస్త్రీయంగా ఈ.ఆర్.సి ముందు ఉంచడంలో విజయం సాధించామన్నారు. పార్టీ అధినేత కేసిఆర్ ఆదేశాల మేరకు స్వయంగా కేటీఆర్ తో పాటు మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు రాష్ట్ర ఈఆర్సీ నీ కలిసి విద్యుత్ చార్జీల పెంపును ఆపాలని కోరారు. ఆ తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రులు ప్రశాంత్ రెడ్డి,మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొని ప్రజల తరఫున వాదనలను గట్టిగా వినిపించారన్నారు. ఈ.ఆర్.సి ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన వ్యతిరేకతను ప్రజాభిప్రాయ సేకరణను ప్రధాన ప్రతిపక్షంగా తాము వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకొని ప్రజల పైన భారీ విద్యుత్ భారాన్ని మోపకుండా ప్రభుత్వాన్ని నియంత్రించిన తీరు గొప్పదని అన్నారు. ప్రజల పైన భారీ విద్యుత్ భారం మోపకుండా ప్రజల పక్షాన నిలిచిన ఈ.ఆర్.సి కి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మర్రి అనిల్ కుమార్,మంచే గోవర్ధన్,దబ్బేటి శైలజ,బయ్యని పిచ్చయ్య,సింగిల్ విండో డైరెక్టర్ పద్మారెడ్డి, వార్డ్ అధ్యక్షులు అన్నందాసు విద్యాసాగర్,తాటి లక్ష్మణ్,సుధగాని వెంకన్న,జిల్లా యువజన నాయకులు కురెళ్ళ పరమేష్,చొల్లేటి నరేష్, మొరిగాల శ్రీను, సోషల్ మీడియా కన్వీనర్ జిట్ట సాయి కుమార్,నాయకులు అమరేందర్,కల్వల శోభన్, జంగ నరేష్, అన్నందాసు మచ్చగిరి,చుక్క అశోక్,కురెళ్ల రమేష్,బందెల శ్రీను,దాసరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారిని కలిసిన స.హ. చట్టం నేతలు



**శ్రీకాకుళం, అక్టోబరు 29 (నిఘా న్యూస్):** జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావును సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా నాయకులు కలిశారు.మంగళవారం డీఆర్వో కార్యాలయంలో నూతనంగా విధుల్లో జాయిన అయిన సందర్భంగా రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా స.హ.చ.రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖ రావు మాట్లాడుతూ ఆర్టీఐ అమలుకు కృషి చేయాలని కోరారు.రెవెన్యూ శాఖలో పౌర సమాచార అధికారులు, మొదట అప్పిలెట్ అధికారులు కోరిన సమాచారం అందించుటలో కాలయాపన చేస్తున్నారని అన్నారు. నిర్దిష్ట కాల పరిమితి 30 రోజుల్లో అందించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పాడ సూర్యనారాయణ,చుక్క రాము,ఉప్పాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ లో స్వచ్ఛ భారత్




**ప్రొద్దుటూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మన చుట్టూ ఉన్న పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకోవాలని, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నారు. భారత ప్రభుత్వము యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్ మొదటి వార్షికోత్సవ సందర్భంగా వికషిత పౌండేషన్ ఆధ్వర్యంలో దివాలి విత్ మై భారత్ అనే స్వచ్ఛత ప్రోగ్రాంను మంగళవారం స్థానిక కూరగాయల మార్కెట్ లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన, ఒంటెరు శ్రీనివాసుల రెడ్డి, వికషిత పౌండేషన్ శూలం లక్ష్మీ దేవి డాక్టర్ నరసింహ, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్, రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజ్, వేదవ్యాస డిగ్రీ విద్యార్థులతో కలిసి కూరగాయల మార్కెట్ పరిసరాల ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వి సుబ్బరాయుడు, జూటూరు విజయ్ కుమార్, వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ హరి నారయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గౌరి శంకర్, రాణి తిరుమల డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వర రెడ్డి వేదవ్యాస డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామలక్ష్మి రెడ్డి, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలో అఖిల పక్షానికి స్థానం కల్పించాలి



**మోత్కూరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో అఖిలపక్ష నాయకులను కమిటీలో సభ్యులుగా చేర్చాలని మోత్కూర్ బిజెపి మండల అధ్యక్షులు దీటి సందీప్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండాలని సంకల్పంతో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మూడు లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని ఇది మరిచి తెలంగాణ ప్రభుత్వం తమ పార్టీకి సంబంధించిన నాయకులను ఆ కమిటీలో సభ్యులుగా చేర్చడం ఏకపక్ష నిర్ణయమని, ఇలాంటి నిర్ణయాల వల్ల సామాన్యులకు న్యాయం జరగదని అఖిలపక్ష నాయకులు ఉన్నట్లయితే ప్రతి ఒక్కరికి నిజమైన లబ్ధిదారులకు ఇల్లు అందుతుందని అన్నారు.ప్రభుత్వం ఆలోచించి కమిటీలో ఖచ్చితంగా అఖిలపక్ష నాయకులను సభ్యులుగా చేర్చాలని డిమాండ్ చేశారు.

## 50 లక్షలతో బాలవిహార్ పార్కు సుందరీకరణ

### రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప




**రామచంద్రాపురం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న బాలవిహార్ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప తెలిపారు. సుమారు 50 లక్షల రూపాయలతో పార్క్ సుందరీకరణ పనులు జరుగుతున్న సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ పుష్పనగేష్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ ప్రభు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పార్కులో నూతన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ప్లే ఆపరేటర్స్, గేట్, పార్క్ కమాన్, వాల్ పెయింటింగ్, గజిబో(యోగ చేసే స్థలం), బట్టర్ ఫ్లై లైటింగ్, చైర్స్, గాంధీ విగ్రహానికి సుందరీకరణ పనులు చేపడుతున్నట్టు కార్పొరేటర్ తెలిపారు. వాకింగ్ ట్రాక్ ను పరిశీలించి నాణ్యతలో రాజి లేకుండా పనులు చేయించాలి అని అధికారులకు ఆదేశించారు. థీమ్ పార్క్ మాదిరిగా బాలవిహార్ పార్కును అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. కార్యక్రమంలో పీటర్, ఐలాపూర్ ఐలేష్, సీఎం మల్లేష్, మహేందర్ రెడ్డి, ఎల్వర్తి మల్లేష్, రవి, భూషణం, మంగలి జగన్, బైకన్ నవీన్, చాకలి నర్సింహా, చంద్రకళ, అశ్విని, విజయలక్ష్మి, ఈర్ల మహేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ ను అప్పగించిన పోలీసులు



**పెబ్బేరు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని మండల కేంద్రానికి చెందిన వ్యక్తి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ మంగళవారం బాధితులకు అందజేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని చెలిమిల్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య దాదాపు కొన్ని రోజుల క్రితం వారి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు సీఈఐఅర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా వారి మొబైల్ ఫోన్ ను గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకుని బాధితునికి మంగళవారం పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.ఎవరైనా సెల్ పోన్ పోగొట్టుకున్నట్లయితే వివరాలను సీఈఐఅర్ ఫోర్టల్ నమోదు చేస్తే ఫోన్లను గుర్తించడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఎవరికైనా మొబైల్ ఫోన్లు దొరికితే వాటిని వెంటనే పోలీస్ స్టేషన్ లో అందించాలని ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి కోరారు. మొబైల్ తిరిగి తన చేతికి వచ్చినందుకు సి ఈ ఐ ఆర్ పోర్టల్ చాలా ఉపయోగపడిందని తిరిగి మొబైల్ ను ఎస్సై చేతుల మీదుగా తీసుకోవడంతో వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

## మేడ్చల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డిఎస్పి




**మేడ్చల్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మేడ్చల్ పోలీస్ స్టేషన్ ను మంగళవారం డిఎస్పి కోటిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని పలు రికార్డులను, పెట్రోలింగ్ వాహనాలను పరిశీలించారు. న్యాయం కోసం స్టేషన్ కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిపి శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మధిరలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



**మధిర, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** తెలుగుదేశం పార్టీ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి జరిగిందని టి టీడీపీ ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత కార్యక్రమాన్ని డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు చేకూరు శేఖర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గ్రామ, మండల,నియోజకవర్గ స్థాయిల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణలో పార్టీ బలోపేతానికి మండల,గ్రామ స్థాయి నాయకులు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వంగాల రామకోటి,మార్నీడి పుల్లారావు, చెరుకూరి కృష్ణారావు, యలమంచిలి శివ, దేవభక్తుని వెంకట్, మాదలనర్సింహారావు, మైనీడి జగన్,చెన్నం స్వామి,గడ్డం రమేష్, పత్తిపాటి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## రామడుగులో ఆర్ఎస్ఎస్ పద సంచలన్

**రామడుగు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం రామడుగు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో ధ్వజారోహణ అనంతరం ప్రార్థన నిర్వహించి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానం నుండి భారీ ఎత్తున పురవీధుల నుండి పద సంచలన్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యాత్రలో స్వయం సేవక్ సభ్యులు ఏకరూప దుస్తులతో చేతిలో దండ చేపట్టి నిర్వహించిన కవాతు గ్రామస్తులు అందరినీ ఆకట్టుకుంది. వారికి గ్రామస్తులు పూలతో నీరాజనం పలికారు. అనంతరం బౌదిక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ్ ప్రచారక్ భానుజీ మాట్లాడుతూ దేశం కోసం, దర్మం కోసం మనమంతా కంకణ బద్దులమై పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శాఖ ప్రతిజ్ఞ చేశారు.

## మాజీ మంత్రి పరసారత్నంకు పరామర్శలు

### రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే పులివర్తి నాని



**చంద్రగిరి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మాజీ మంత్రి పరసారత్నం గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడన్న విషయం పులివర్తి నాని ద్వారా తెలుసుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి ఆయనను పరామర్శించారు. తిరుపతి పర్యటనలో ఉన్న మంత్రి చంద్రగిరి ,శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి తో కలిసి మాజీ మంత్రి పరసారత్నం ను ఆయన స్వగృహంలో పరామర్శించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి వారితో కలిసి న్యూ బాలాజీ కాలనీలోని స్వగృహంలో ఆయనను పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్యు సేవలపై ఆరా తీసి త్వరగా కోలుకొని తిరిగి పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఆయనను కలిసిన వారిలో నరసింహా యాదవ్, శ్రీధర్ వర్మ తో పాటుగా తెదేపా నాయకులు ఉన్నారు.

## మట్టి ఖర్చులకు సాయం చేసిన తెలుగుదేశం నేతలు



**బెల్లంకొండ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామ ఎస్టి కాలనీకి చెందిన రావూరు వీరయ్య(78) సోమవారం రాత్రి సహజ మరణం చెందారు. విషయం తెలుసుకున్నా మండల తెదేపా సీనియర్ నాయకులు వెన్నా సీతారామిరెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షుడు బద్దూరి వీరారెడ్డి తో కలిసి వీరయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళు లర్పించారు.మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందించారు. వీరయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సందర్శించిన వారిలో మాజీ ఎంపీటీసీ టి.కిచ్చారెడ్డి వెన్నా వెంకటరెడ్డి మాణిక్యాల గణపతి మన్నెం వెంకటేశ్వర్లు పొన్నం వెంకటేశ్వర్లు ఏకశిరి చెంచయ్య యాదగిరి సంజీవులు పొన్నూరు పోతురాజు పొట్లూరి మస్తాన్ గ్రామ పెద్దలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో పోలీసుల క్రొవ్వొత్తుల ర్యాలీ

### అమరుల త్యాగాల ఫలితమే నేటి ప్రశాంత జీవనం: జిల్లా ఎస్పీ



**సిరిసిల్లఢ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలాల్లో భాగంగా వారిని స్మరిస్తూ జిల్లా పోలీస్ వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నేతన్న చౌరస్తా నుండి అంబేద్కర్ మీదుగా గాంధీ చౌరస్తా వరకు క్రొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళు అర్పించిన జిల్లా ఎస్పీ, పోలీస్ యంత్రాంగం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణాలర్పించి పోలీసు అమరవీరులను ప్రజలు మరువద్దని,వారి త్యాగాల ఫలితమే నేడు ప్రశాంత వాతవరణం నెలకొందని,ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం అమరవీరుల సంస్మరణ వారోత్సవలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ సంవత్సరం వారిని స్మరిస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సైకిల్ ,బైక్ ర్యాలీ,2కె వ్యాసరచన పోటీలు,షార్ట్ ఫిలిమ్స్,ఓపెన్ హౌస్ కార్యక్రమలు నిర్వహించామన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలి అన్నారు.

# పెద్దఅంబర్ పేట్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- పలు అభివృద్ధి పనులను ఆమోదించిన కౌన్సిల్
- మున్సిపల్ చైర్మన్ పండుగల జయశ్రీ




**అబ్దుల్లాపూర్ మెట్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్ పర్సన్ పండుగల జయశ్రీ అన్నారు. మంగళవారం పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ ఎన్అర్ కాలా కన్వెన్షన్ లో చైర్ పర్సన్ జయశ్రీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 45 అజెండా అంశములపై చర్చించి ఆమోదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు ముఖ్యంగా వాటర్ ,లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కమిషనర్ ఎస్. రవీందర్ రెడ్డి కౌన్సిలర్ లు గ్యారల శ్రీనివాస్ మోతె మణెమ్మ వద్దేపల్లి విద్యావతి బొర్ర అనురాధ పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి, చల్లూరి మురళీధర్ రెడ్డి, మల్ రెడ్డి దీపిక పబ్బతి లక్ష్మణ్ మద్ది నరేందర్ రెడ్డి తొండపు రోహిణి రెడ్డి, పాశం అర్చన, మండల కోటేశ్వరరావు రమావత్ పరశురాం జోర్క గీత ఓరుగంటి సుజాత గౌడ్ చెవుల హరిశంకర్ సిద్దంకి కృష్ణారెడ్డి కందాడ అనుపమ కో ఆప్షన్స్ సభ్యులు మహమ్మద్ ఖలీమ్, చర్లపల్లి శంకరయ్య గౌడ్, మేనేజర్ కిరణ్, అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక రీచ్ లు ఏర్పాటు చేయొద్దండి

### తాటిగుంట పల్లి పంచాయతీ గ్రామ సభలో తీర్మానం

**రాయచోటి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** వీరబల్లి మండలం తాటిగుంట పల్లి పంచాయతీ లోని రెడ్డి వారిపల్లి హరిజనవాడ సమీపంలోని మాండవ్య నదిలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని సన్నహాలు చేస్తుండడంతో అక్కడి ప్రజలు, రైతులు మా ప్రాంతంలో ఇసుక రీచ్లు ఏర్పాటు చేయవద్దని గ్రామ సభలో తీర్మానం చేశారు. ఇప్పటికే బూగర్భ జలాలు అడుగంటి పోయి పంటలు సాగులో లేక చాల నష్టపోయమని తెలిపారు.నదీ పరివాహక ప్రాంత రైతులకు తీవ్ర నీటి ఎద్దడితో బోర్లు బావుల్లో నీటిమట్టం తగ్గిపోయి పంట పొలాలు పెట్టడానికి అవకాశం ఉండదని గ్రామ సభలో తీర్మానం చేశారు. సర్పంచ్ గోపి నాథ్ రెడ్డి అధ్యక్షతన తాసిల్దార్ శ్రావణి గ్రామసభ నిర్వహించారు. ప్రజలకు పలు రకాలుగా అధికారులు ఇసుక రీచ్ వల్ల అనుకున్నంత ఇబ్బంది ఉండదని నచ్చజెప్పడానికి ప్రయత్నించగా ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఇసుక రిచ్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. గతంలో వున్న అప్పటి కలెక్టర్ కూడ వీరబల్లి మండలం ఇసుక రీచ్ లకు అనుకూలమైన ప్రాంతం కాదని స్పష్టం చేసారని తెలిపారు.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఈ విషయం పైన అలోచించాలని సర్పంచ్ గోపినాధ్ రెడ్డి, ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మారెడ్డి, హరినాధ్ రెడ్డి, రవి కుమార్ రెడ్డి, భాస్కర్ రాజు, దుర్గం ఆంజనేయులు, వెంకట్రాజు, లక్ష్మమయ్య తదితరులు పాల్గొన్నారు.



# బాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీ చేసిన మంత్రి



**ఖమ్మం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** విద్య పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, అధికారం లోకి వచ్చిన రెండు నెలల్లోనే 637 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంగళవారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహకల్ప కాలనీ, బారుగూడెం గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో రూ. 13.50 లక్షల చొప్పున నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. గోళ్లపాడు గ్రామంలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న బాలికలకు పిఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత సైకిళ్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు కు దీటుగా తీర్చిదిద్దామన్నారు. అన్ని వసతులతో పాటు, ఇంగ్లీష్ మీడియం బోధన చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న చిన్నచూపు పోయేలా టీచర్లు, అధికారులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్గించాలన్నారు. మీ కుమారుడు, మనవడి చదువుపై ఎలాగైతే శ్రద్ధ తీసుకుంటారో, అలా ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా పాలేరు నియోజకవర్గ ప్రతి మండలానికి ఒక హైస్కూల్ లో పూర్తి స్థాయిలో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు.ప్రతి విద్యార్థితో ప్రతిభ దాగివుంటుందని, ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ హైదరాబాద్ లో ఏర్పాటుచేసినదని, దీని మూడు శాఖలు మధిర, హుజురాబాద్,ఆదిలాబాద్ లలో ఏర్పాటు అవుతాయని, త్వరలో పాలేరులో కూడా దీని శాఖ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి అన్నారు. పిఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం బాలికలకు సైకిళ్ల పంపిణీ చేస్తామని, ఈ సంవత్సరం 7వ త్వరగతి చదివే విద్యార్థిని వచ్చే సంవత్సరం 8వ తరగతిలో చేరగానే సైకిల్ అందజేస్తామని మంత్రి తెలిపారు. ఇంటి దగ్గర అమ్మా, నాన్నలు ఎంతో కష్టపడి చదివిస్తారని, పిల్లలు బాగుగా చదువుకొని, వారి ఆశలు నెరవేర్చాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, ఖమ్మం రూరల్ మండల ఎంపిడిఓ కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంఇఓ శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పంటల విధానంపై అవగాహన

### పంట పొలాలను పరిశీలించిన డీపీఎం అమల కుమారి



**బెల్లంకొండ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** బెల్లంకొండ మండలం కందిపాడు గ్రామంలో బాధనేటి వెంకటేశ్వర్లు వ్యవసాయ క్షేత్రమును జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమల కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటేశ్వర్లు ప్రత్తి ఏ గ్రేడ్ మోడల్ లో 6 వరుసల ప్రత్తి తరువాత కంది అంతర పంటగా వేసుకోవడం దానితో పాటు వివిధ రకాల అంతర పటలు సాలుకు, సాలుకు మధ్యలోపెసర, అలసంద, సజ్జ, గోరుచిక్కుడు వరసలు ఈ విధంగా పలు పంటల వేయడం వలన జీవవైవిధ్యం బాగా పెరుగి అధిక దిగుబడి వస్తుంది అని తెలియజేయడం జరిగింది, అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పీఎం డిఎస్ ఘన జీవమృతం, పాటించడం వలన అతి తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన, అధిక ఆదాయం ఇచ్చే, భూమిని సారవంతం చేసే వ్యవసాయం చేయవచ్చన్నారు. రామయ్య మెంటర్ మునగ తోటలో ఏటీఎం మోడల్ పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ఆడిషినల్ డిపియం ప్రేమ్ రాజ్ ఎంటి ఎల్ పవన్ కుమార్ ఎం టి అనంతలక్ష్మి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ లో ఆయుర్వేద, ధన్వంతరి జయంతి



**వరంగల్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలో తొమ్మిదవ ఆయుర్వేద డే ధన్వంతరి జయంతి సందర్భంగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు, ఆయుష్ డిపార్ట్మెంట్, ఆధ్వర్యంలో ఆయుష్ ఆర్ డి డి ప్రమీల దేవి ఆదేశాల మేరకు యాకుబ్ పుర ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ లో ఆయుర్వేద వైద్య శిబిరం ,యోగ పై అవగాహన కార్యక్రమం డాక్టర్ మైదం రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద మందుల ప్రాముఖ్యత, ఆయుర్వేద వైద్య శాస్త్రం కోసం ధన్వంతరి చేసిన సేవలు, రోజు వారి నిత్య జీవితంలో ఆయుర్వేద వైద్యం, మందుల గురించి యోగ ప్రాముఖ్యత గురించి స్టూడెంట్స్ కి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిధిగా జిల్లా ఆయుష్ ఇంచార్జి వైద్యులు డాక్టర్ మైదం రాజు, లక్ష్మి పురం వైద్యాధికారి డాక్టర్.సహజ, రామచంద్రపురం వైద్యా ధికారి డాక్టర్ రాజేందర్ ,స్కూల్ ప్రిన్సిపాల్ రామ్మోహన్, వైస్ ప్రిన్సిపాల్ మధు ఫార్మసిస్ట్ సంజయ్ యోగ కోచ్ బొలిశెట్టి కమలాకర్ సమ్మక్క, ఏ ఎన్ ఎం పాఠశాల సిబ్బంది పాల్గొని స్టూడెంట్స్ కి వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు స్టూడెంట్స్ కి వివరించి,యోగ ప్రాముఖ్యత, స్టూడెంట్స్తో యోగ ఆసనాలు వేయించి యోగ,ఆయుర్వేద వైద్యంపై అవగాహనా కార్య క్రమం నిర్వహించి, ఆయుర్వేద మందుల పంపిణి చేశారు.

## రంగలీల మైదానంలో నేడు నరకాసుర వధ



**వరంగల్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** వరంగల్ నగరం లోని ఉరుసు రంగలీల మైదానంలో 30న బుధ వారం సాయంత్రం నరకాసుర వధ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు. కరీమాబాదులోని బీరన్న దేవాల యంలో మరుపల రవి మాట్లాడుతూ భారతీయులు జరుపుకునే ముఖ్యమైన పండుగ దీపావళి అని నరకాసుర వదను తిలకించిన తర్వాతనే దీపావళి నోములు పూజలు పండగ జరుపుకోవాలని వేద పండితులు తెలుపుతున్నారని ఆయన అన్నారు. ఈ ఉత్సవాలకు మంత్రి కొండ సురేఖ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మేయర్ గుండు సుధారాణి వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని వాకాడే, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝ హాజరవుతు న్నారని తెలిపారు.గత 22 సంవత్సరాలుగా నరకాసుర వధ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరుపుతున్నామని రవి వెల్లడించారు. ఈనెల 30 బుధవారం సాయంత్రం 4 గంటలకు ఉరుసు గుట్ట కూడా మైదాన ప్రాంగణంలో 58 అడుగుల నరకాసుర చిత్రపటాన్ని అత్యంత శక్తివంతమైన బాణాసంచాతో దహనం చేయికార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సాయంత్రం ఐదు గంటల నుం డి ఉరుసు గుట్ట వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నరకాసుర వధ ఉత్సవాల విజయవంతానికి రాష్ట్ర మంత్రి కొండ సురేఖ తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని రవి వెల్లడించారు. నరకాసుర వద్ద కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరు కావాలని రవి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామల రావు కోశాధికారి రవి సహాయ కార్యదర్శి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి గౌతం ఆ కార్యవర్గ సభ్యులు శివ, గౌడ రాము, రాజు ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

## సాయి చిత్ర నగర్ లో చెత్త చెదారం

### ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



**హబ్సిగూడ, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** హబ్సిగూడ డివిజన్, సాయి చిత్ర నగర్, స్ట్రీట్ నెంబర్ 5 లో ప్రతినిత్యం చెత్తా,చెదారంతో, డంపింగ్ యార్డ్ గా మారుస్తున్న గోడౌన్లపై, మున్సిపల్ అధికారులు చర్య తీసుకోవాల్సిందిగా, సాయి చిత్రా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది. ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా, గాని గోడౌన్లపై చర్య తీసుకోలేదు, ప్రతిరోజు డీసీఎంలు అర్ధరాత్రి కూడా తీసుకొని వచ్చి చెత్తాచెదారం నింపుతూ, రాత్రిపూట నిద్రలేకుండా బస్తివాసులను చేస్తున్నారు, కాలనీ మొత్తం అపరిశుభ్రంగా చేస్తున్నారు. దోమలు ఈగలు ప్రతినిత్యం ముసురుకుంటున్నాయి. తద్వారా డెంగు మలేరియా లాంటి జ్వరాలు వచ్చేస్తున్నాయి. కావున వెంటనే మున్సిపల్ అధికారులు విచ్చేసి, గోడౌన్ లపై, చెత్త వేసిన వారిపై ,కఠిన చర్య తీసుకోవాల్సిందిగా సాయిచిత్ర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు.

# నగర అభివృద్ధికి కలసి కట్టుగా పనిచేద్దాం

- మాస్టర్ ప్లాన్ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగర అభివృద్ధికి, పరిశుభ్రతకు అందరూ కలసికట్టుగా పనిచేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగర అభివృద్ధికి చేయాల్సిన పనులపై నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్యతో కలసి అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో ఇంజినీరింగ్ విభాగంలో ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల గూర్చి, నగరంలో పన్నుల వసూళ్ళు, టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో నగర సుందరీకరణకు చేస్తున్న పనుల వివరాలను ఆయా విభాగాల అధికారులతో పాటు కమిషనర్ ఎన్.మౌర్య పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన తిరుపతిని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో కార్పోరేటర్లను భాగస్వామ్యం చేసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నగరంలోని 38 మురికి వాడల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. నగరంలోని అంతర్గత రోడ్ల నిర్మాణం, మరమ్మతులు వెంటనే చేయాలని అన్నారు. విద్యుత్ దీపాల నిర్వహణ సక్రమంగా చేయాలని ఆయన కోరారు. నగర శివారు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వాటర్ పైప్, డ్రెయినేజీ పైప్ లైన్లు కలసి నీటి కలుషితం లేకుండా చూడాలని అన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో జరిగిన పొరపాట్లను గుర్తించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. యుడిఎస్, తాగునీరు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు అవసరమైన నిధులకు సంబంధించిన ప్రతిపాదనలను రెడీ చేస్తే సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్ళి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు జరిగేలా అన్ని అభివృద్ధి పనులు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సెక్రటరీ రాధిక, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, డి.సి.పి. మహాపాత్ర, వెటర్నరీ ఆఫీసర్నాగేంద్ర,మేనేజర్హసీమ్, డిఈలు, ఏసిపి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణం

### పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సిరిసిల్ల, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** సిరిసిల్ల ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసు కు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ కు ఘన స్వాగతం పలికారు. ఎంతోమహిమ గల పెద్దమ్మ తల్లి కల్యాణం సిరిసిల్ల ముదిరాజులు వైభవంగా జరుపుతామని అతల్లి దీవెనలు ఎప్పుడు ఉంటాయని లోక కళ్యాణార్థం పెద్దమ్మ తల్లి కల్యాణం జరుపుతామని కుల పెద్దలు తెలిపారు. ఈ వేడుకలకు విచ్చేసి పెద్దమ్మ తల్లి పెద్దిరాజుల దర్శించుకున్న అది శ్రీనివాస్ ముదిరాజులతో కలసి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముదిరాజు కుల పెద్దలు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలకు నేతలే సూత్రధారులా..!

### అనుమతులు రెసిడెన్షియల్ కట్టేది కమర్షియల్
### అక్రమ నిర్మాణాల వెనుక రాజకీయ నేతలు
### లంచాల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు



**మల్కాజిగిరి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీ నియమ నిబంధలు ఉల్లంఘిస్తూ అడ్డు అదుపు లేకుండ భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. రోడ్ల కబ్జా చేస్తూ బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా పట్టించుకునే వారు కనిపించరు.భవన యజమానులు తీసుకున్న అనుమతులకు చేస్తున్న నిర్మాణాలకు ఎక్కడ పొంతన ఉండదు. జీహెచ్ఎంసీ కార్యాలయం నుండి రెండు ఫ్లోర్లకు అనుమతులు పొంది మూడు నాలుగు అంతస్తులు వేస్తున్నారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ కాంప్లెక్సలు కడుతున్నారు.రోడ్డు వైడింగ్‌లు సెట్ బ్యాక్స్, మాస్టర్ ప్లాన్ నియమ నిబంధనలు పట్టించుకోరు. వీరిని అడిగే వారు ఉండరు ఎందుకంటే అధికారులకు అడిగినంత ముట్టజెప్పి రాజకీయ పలుకుబడి ప్రదర్శిస్తారు కాబట్టి.! టౌన్ ప్లాన్ చట్టాలను ఉల్లంఘిస్తూ చేస్తున్న నిర్మాణాల వద్ద అడిగితే తాము పలానా లీడర్‌కు సంబందించిన అనుచరులం అంటూ దబాయింపులు సర్వసాధారణమైంది. అక్రమ నిర్మాణ దందా వెనుక రాజకీయ నాయకుల పాత్ర కీలకం అనేది ప్రజల నుండి బలమైతున్నాయి. మల్కాజిగిరి, గౌతమ్ నగర్, మౌలాలి, వినాయక్ నగర్, నెరేడ్‌మెట్, ఆనంద్ బాగ్ డివిజన్ల పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. బిల్డర్లు, అధికారులు, రాజకీయ లీడర్ల సిండికేట్ దందా వ్యవహారం ఇది. టౌన్ ప్లాన్, మాస్టర్ ప్లాన్ నియమాలకు తూట్లు పొడుస్తూ ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల గండి కొట్టే అక్రమార్కులకు ఇక్కడ కొదవ లేదు అంటూ పలు కాలనీ సంఘాలు, సామాజిక కార్యకర్తలు అంటున్నారు. టౌన్ ప్లాన్ కార్యాలయమే కేంద్రంగా జరుగుతున్న సిండికేట్ దందాపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి అక్రమాలను నియంత్రించాలని కోరారు.

## హై టెన్షన్ వైర్లు తగిలి... యువకుడికి తీవ్ర గాయాలు

### ఉస్మానియా ఆసుపత్రికి తరలింపు



**అంబర్‌పేట్, అక్టోబర్ 29(నిఘా న్యూస్):** దీపావళి సందర్భంగా ఓ హోటల్ భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్న యువకుడికి ప్రమాదవశాత్తు హై టెన్షన్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడిన సంఘటన అంబర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాతబస్తీ ఉప్పుగూడ లలితా బాగ్ కు చెందిన అభిలాష్(18) మంగళవారం మధ్యాహ్నం అంబర్ పేట అలీకేఫ్ చౌరస్తాలోని శివానంద హోటల్ భవనానికి దీపావళి సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నాడు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు అభిలాష్ కు పక్కనే ఉన్న హై టెన్షన్ వైర్లు తగిలి విద్యుత్ ఘాతానికి గురై శరీరమంతా కాలిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న అంబర్ పేట పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన అభిలాష్ ను 108 అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసును అంబర్ పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఉపాధ్యాయ ఎన్నికల్లోనూ

# అగ్రవర్ణాల పెత్తనం

- 80శాతం బీసీ దళిత వర్గాలు ఉన్నా మొండి చేయేనా
- బిసి ఉపాధ్యాయుడిని ఎమ్మెల్సీగా బరిలో నిలిపి గెలిపిస్తాం
- ప్రధాన ఉపాధ్యాయ సంఘాలను బహిష్కరించాలని పిలుపునిచ్చిన విక్రమ్ గౌడ్



**హైదరాబాద్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** మార్చిలో జరుగనున్న నల్గొండ,ఖమ్మం,వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని ఉపాధ్యాయ సంఘాలు అగ్రవర్ణాల అభ్యర్థులనే నియమించడాన్ని ఖండిస్తున్నామని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం పనిచేయాల్సిన ఉపాధ్యాయ సంఘాలు ఒకే వర్గానికి జై కొట్టడం బాధాకరం.ఆయా సంఘాల్లో 80 శాతం బడుగు బలహీన వర్గాలకు చెందిన ఉపాధ్యాయులు ఉండగా ఎవరికి టికెట్ కేటాయించకుండా తమ వారినే ప్రకటించు కోవడం సంఘాల నియంతృత్వానికి నిదర్శనం అన్నారు.తమ సంఘం సామాజిక దృక్పధం తో పని చేస్తాయని చెప్పుకునే సంఘాలు వరుసగా అగ్ర వర్ణాలకే అవకాశం ఇవ్వడం ఉపాధ్యాయ లోకాన్ని మోసం చేయడమే అన్నారు.ఇప్పటికే పీఆర్ టి యు అభ్యర్థి గా పింగళి శ్రీపాల్ రెడ్డి, యుటిఎఫ్ నుండి నర్సిరెడ్డి, టి పిఆర్టియు నుండి హర్షవర్ధన్ రెడ్డిని ప్రకటించి ద్వారా వారి ఆధిపత్య వైఖరి బట్టబయలు అయింది అన్నారు. ఇట్టి సంఘాల ఎన్నికల్లో కూడా 80 శాతం ఉన్న బీసీ టీచర్లను అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు కూడా కాకుండా ఈ వర్గాలు గతంలోనే కుట్ర చేశాయని , బడుగు బలహీవర్గాలకు చెందిన ఉపాధ్యాయులు బయటికి వచ్చి బీసీ అభ్యర్థి నీ పోటీలో నిలిపి ఐదు శాతం ఉన్న ఆధిపత్య నాయకుల కుట్రను గ్రహించి వారికి బుద్ధి చెప్పే విధంగా ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు తగిన గుణపాఠం నేర్పాలని రాబోయే రోజుల్లో కచ్చితంగా బీసీ ఉపాధ్యాయునే, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీలో నిలిపి గెలిపించే బాధ్యత బీసీ సంఘం తీసుకుంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్ల అధ్యక్షుడు ఇంద్రం రజక, సెక్రటరీ సన్నీ యాదవ్, జాయింట్ సెక్రెటరీ గణేష్ చారి, మనోజ్, రాహుల్ ముదిరాజ్, ప్రభాకర్, నరసింహ మరియు నేతలు పాల్గొన్నారు.

## సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా... వ్యాధులను నయం చేస్తున్న ఆయుర్వేదం

### ఘనంగా తొమ్మిదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం



**శ్రీకాకుళం, అక్టోబర్ 29 (నిఘా న్యూస్)** ఆయుర్వేదం సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వ్యాధులని నయం అవుతాయని సీనియర్ వైద్యాధికారి డాక్టర్ .పి.జగదీష్ అన్నారు. అక్టోబర్ 29న తొమ్మిదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం,శ్రీకాకుళం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ , ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయుర్వేద మూల పురుషుడైన శ్రీభగవాన్ ధన్వంతరీ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు వేసి జయంతి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యాధికారి డాక్టర్ .పి. జగదీష్ మాట్లాడుతూ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ధన్తేరాస్, ధనత్రయోదశి రోజున వైద్య దేవుడైన ధన్వంతరి జయంతిగా ప్రతిసంవత్సరం జరుపుకుంటున్నమన్నారు . ధన్తేరాస్,ధనత్రయోదశిని భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో దీపావళి పండుగను గుర్తించే మొదటి రోజుగా భావిస్తారు. భారత ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ 2016లో ఈ రోజును జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా ప్రకటించింది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ , ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ వారి ఆదేశాల మేరకు తొమ్మిదవ, జాతీయ ఆయుర్వేద దినోత్సవం పరస్కరించి గత ఎనిమిది రోజులు నుండి వివిధ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. "ఆయుర్వేద ఫర్ గ్లోబల్ హెల్త్ " అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం వారు తొమ్మిదో జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించమని ఆదేశాలు జారీ చేశారు. ఆయుర్వేదం వైద్యం, భారతీయ సంస్కృతి , సాంప్రదాయం,జీవన విధానంలో భాగం.మనిషి నిత్య జీవితంలో ఆందోళన, మెకానికల్ లైఫ్ కారణంగా శారీరక,మానసిక వ్యాధులకు గురి కావడం జరుగుతుంది.మనిషి నిత్యం యోగ చేయడం, జీవన శైలిని క్రమ పద్ధతిలో అవలంబించడం వలన వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండగలం. దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం చక్కటి పరిష్కారం మార్గం ఆయుర్వేద మందులు వాడే సమయంలో పత్యం పాటించాలని, వేడి చేస్తాయి అనేది అపోహ మాత్రమే .ఇవి హెర్బల్ ప్రిపరేషన్స్ , శరీరంపై ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వ్యాధులని నయం చేస్తాయి.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కాంపౌండ్ , ప్రాంగణంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాల ఈ మధ్య ఉన్నతీకరించబడి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, వెల్నెస్ సెంటర్ గా అప్డేట్ చేయబడింది . రోగులకు మరింత మెరుగైన సేవలు అందించుట కోసం సీనియర్ వైద్యాధికారి అందుబాటులో ఉన్నారు. యోగా నేర్పించుటకు ఇద్దరు ఇన్ స్ట్రక్టర్లు అందుబాటులో ఉన్నారు. ఔషధ మొక్కలపై అవగాహన కల్పించడం కోసం హెర్బల్ గార్డెన్ నిర్మించడం జరిగింది. రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించడం వలన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ వారిచే వైద్యశాల గుర్తింపు పొందింది. ఈ జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి బలివాడ మల్లేశ్వరరావు, ఆయుష్ కాంపౌండర్ జాడ చంద్రశేఖర రావు , కొంక్యాన మురళీ వాకర్స్ ప్రెసిడెంట్ యోగ మురళి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో... బెంగాల్, పుణెరి పోరు టై

### ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-11లో
### 32-32తో ఇరు జట్ల స్కోరు సమం



**హైదరాబాద్, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్-11వ సీజన్‌లో మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఆఖరు కూత వరకు ఉత్కంఠరేపిన బెంగాల్ వారియర్స్, పుణెరి పల్టాన్ పోరు 32-32తో టై అయ్యింది. మాజీ చాంపియన్ల సమరంలో ప్రథమార్థం ఆటలో పుణెరి పల్టాన్ మూడు పాయింట్ల ఆధిక్యం సాధించినా.. ద్వితీయార్థంలో బెంగాల్ వారియర్స్ లెక్క సమం చేసింది. పీకెఎల్ సీజన్ 11లో ఇది మూడో టై కావటం విశేషం. బెంగాల్ వారియర్స్ ఆటగాళ్లలో రెయిడర్ సుశీల్(10 పాయింట్లు) సూపర్ టెన్ ప్రదర్శనతో మెరువగా..నితిన్ కుమార్(6 పాయింట్లు), నితేశ్ కుమార్(4 పాయింట్లు) రాణించారు. పుణెరి పల్టాన్ తరఫున ఆకాశ్ షిండే(8 పాయింట్లు), పంకజ్ మోహిత్(8 పాయింట్లు) ఆకట్టుకున్నారు. ఐదు మ్యాచుల్లో మూడు విజయాలు,ఓ టైతో పాయింట్ల పట్టికలో పుణెరి పల్టాన్ అగ్రస్థానం నిలుపుకోగా.. బెంగాల్ వారియర్స్ నాలుగు మ్యాచుల్లో ఒక్క విజయమే సాధించింది. బెంగాల్ వారియర్స్‌తో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ శుభారంభం చేసింది. తొలి పది నిమిషాల్లో పాయింట్ల కోసం ఇరు జట్ల ఆటగాళ్లు చెమటోడ్చారు. ప్రతి కూతకు పాయింట్లు మారుతుండటంతో ఆధిపత్యం కోసం నువ్వా నేనా అన్నట్టు ఉత్కంఠ నడిచింది. తొలి పది నిమిషాల ఆట అనంతరం బెంగాల్ వారియర్స్ 7-6తో ఓ పాయింట్ ముందంజలో నిలిచింది. కానీ తర్వాతి పది నిమిషాల్లో పుణెరి పల్టాన్ పుంజుకుంది. ప్రథమార్థం ఆట ముగిసే సమయానికి పుణెరి పల్టాన్ మూడు పాయింట్ల ఆధిక్యం సాధించింది. 15-12తో బెంగాల్ వారియర్స్‌పై పైచేయి సాధించింది. విరామం అనంతరం బెంగాల్ వారియర్స్ దూకుడు పెంచింది. రెయిడర్లు సుశీల్ సూపర్ టెన్ షోతో దూకుడు పెంచాడు. దీంతో బెంగాల్ వారియర్స్ వెనుకంజ నుంచి పుంజుకుని ఆధిక్యం కోసం పోటీపడింది. రెయిడింగ్‌లో నితిన్ కుమార్, డిఫెన్స్‌లో నితిన్ మెరవటంతో బెంగాల్ వారియర్స్ రేసులోకి వచ్చింది. 30-31తో ఓ పాయింట్ వెనుకంజలో ఉండగా విశ్వాస్ రెయిడ్ పాయింట్‌తో బెంగాల్ వారియర్స్ స్కోరు సమం చేసింది. ఆ తర్వాత వరుసగా చావోరేవో తేల్చుకోవాల్సిన రెయిడ్లలో ఇరు జట్లు నిరాశపరిచాయి. ఆఖరు రెండు కూతల్లో ఎవరికీ పాయింట్ దక్కలేదు. దీంతో 32-32తో బెంగాల్ వారియర్స్, పుణెరి పల్టాన్ సమవుజ్జీలుగా నిలిచి పాయింట్లను సమానంగా పంచుకున్నాయి.

## గుమ్మళ్ళదొడ్డిలో ఎస్పీతో కలిసి కలెక్టర్ పర్యటన

### భూగర్భ జలాలకు ఇబ్బందులు రాకుండా చర్యలు
### కలెక్టర్, ఎస్పీల పర్యటన పట్ల గ్రామస్తులు హర్షం



**గోకవరం, అక్టోబర్ 29 (నిఘ న్యూస్):** అస్సాగో ఇథనాయిల్ పరిశ్రమ వలన భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం గోకవరం మండలం గుమ్మాళ్లదొడ్డి గ్రామంలో కలక్టర్, ఎస్పీ, సమన్వయ శాఖల అధికారులు మరో సారి గ్రామస్థులతో ముఖా ముఖి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ అస్సాగో ఇథనాయల్ పరిశ్రమను గ్రామస్థుల సమక్షంలో ప్రతిరోజు సందర్శించాలని అక్కడ పరిస్థితులను వారికి అర్థమయ్యే విధంగా విశదీకరించాలన్నారు. ఈ విషయంలో ఇబ్బందులు ఎదురైన తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్తులు విడతల వారీగా అస్సాగో ఇథ నాయల్ పరిశ్రమను సందర్శించే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ మేరకు కంపెనీతో చర్చించి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామస్తులు భూగర్భ జలాల సమస్యలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని వీటికి శాశ్వత పరిష్కారాన్ని చేపట్టే విధంగా కృషి చేయడం జరుగుతుందని వారికి హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ , అస్సాగో ఇథనాయిల్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వాది దశరథమహారాజు

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన
### ఘనంగా ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**కర్నూలు, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ప్రజాస్వామ్యానికి ఆద్యుడు దశరథ మహారాజని, ప్రజల ఆకాంక్ష మేరకే శ్రీరాముడిని పట్టాభిషిక్తుడిని చేయ సంకల్పించిన ప్రజాస్వామ్య వాది దశరథమహారాజని, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో దొర్నిపాడు మండలం, భాగ్యనగరం గ్రామంలో వెలసిన శ్రీ రామాలయం నందు ఏర్పాటు చేసిన నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. శ్రీమద్రామాయణం ఉన్నంత వరకే ఈ ప్రపంచం ఆదర్శవంతమైన జీవన మార్గాన్ని అవలంబిస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో వి. రామ సుబ్బారెడ్డి ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు టివి. వీరాంజనేయ రావు, ఆలయ ధర్మకర్త వీరగంధం బ్రహ్మయ్య, గోపాల కృష్ణయ్య, భాష, నరసింహ, వేణు గోపాల్ రెడ్డితో పాటు భజన మండలి సభ్యులు, భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## టిడిపి పాలనలో 77మంది మహిళల హత్య

### జాతీయ మహిళా కమిషన్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
### తిరుపతి ఎంపీ గురుమూర్తి



**తిరుపతి, అక్టోబర్ 29 (నిఘా న్యూస్):** ప్రభుత్వ మార్పు తర్వాత ఆంధ్రప్రదేశ్ లో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, శాంతిభద్రతలు క్షీణించాయని మహిళల రక్షణ కోసం జాతీయ మహిళా కమిషన్ జోక్యం అవసరమని తిరుపతి ఎంపీ గురుమూర్తి, అరకు ఎంపీ గుమ్మా తనూజా రాణి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మంగళవారం ఢిల్లీ లోని జాతీయ మానవ హక్కుల కమిషన్ చెర్మన్, మహిళా కమిషన్ చైర్మన్ ను కలిశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, అత్యాచారం, హత్యల కారణంగా విషాదకర రీతిలో మహిళలు ప్రాణాలు కోల్పోయిన కేసులు 77నమోదయ్యా యని,ఈ పరిస్థితి రాష్ట్రంలోని మహిళల భద్రతను తీవ్రంగా ప్రభావితం చేసిందని చాలా మంది పగటిపూట కూడా తిరిగేందుకు భయపడుతున్నారని వారికీ వివరించారు. ఆందోళనకరంగా ఇలాంటి ఘోరమైన సంఘటనలు జరిగినప్పటికీ,ఈ నేరాలను పరిష్కరించడంలో బాధితులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించడం లేదని చైర్మన్ కు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి, హోం మంత్రితో సహా ప్రభుత్వంలోని ముఖ్య నాయకులు ఇసుక, మద్యం అక్రమ దోపిడీ వ్యాపారం, ప్రతిపక్షాలను అణచివేయడం వంటి ఇతర కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారని, ఈ నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడం తోపాటు మహిళల భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడిందని వారి దృష్టికి తీసుకెళ్లారు.

# ప్రతి సభ్యురాలికి సబ్సిడీపై పాడి పశువులు

- వ్యవసాయంతో పాటు ఆదాయ కోసం ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు
- డెయిరీ పాలతో నెలకు 25 కోట్ల సంపాదనకు అవకాశం
- ఇందిరా మహిళా డెయిరీ లోగో ఆవిష్కరించిన భట్టి





**మధిర, అక్టోబర్ 29(నిఘా న్యూస్):** గత పాలకులు ఏడు లక్షల కోట్ల అప్పు చేసి ఖర్చులు పెట్టి పోయారు వాటిని తీర్చే పనిలో మేము ఉన్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మధిర లో ఇందిరా పాల ఉత్పత్తి కేంద్రం లోగో ప్రారంభ సభ లో ఆయన ప్రసంగించారు.ప్రతి నిమిషం ప్రజల కోసమే ఈ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది, ప్రతిరోజు 18 గంటల పాటు పనిచేస్తున్నాం, ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజల అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని డిప్యూటీ సీఎం అన్నారు.దేశం మన వైపు చూసేలా ఇందిరా మహిళా డెయిరీ విజయం సాధించాలని అన్నారు. సిరిపురంలో 26కోట్ల అంచనా వ్యయంతో సిరిపురం నుండి నెమలి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ,పటిష్ట పనులకు శంకుస్థాపన చేసారు. మధిర రెడ్డి గార్డెన్స్ లో ఇందిరా డెయిరీ లోగో ఆవిష్కరించి మహిళా సంఘాల సభ్యులతో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధిర అసెంబ్లీ సెగ్మెంట్ సంబంధించి మహిళల చేత పాల వ్యాపారం చేయించేందుకు 2011లో రూపకల్పన చేసుకున్న ఇందిరా మహిళా డెయిరీ ఆకాంక్ష నేడు నెరవేరుతుందని అన్నారు. వ్యవసాయ ఆదాయానికి తోడు పాడి రైతుల ఆదాయం జత చేస్తే కుటుంబాలు మరింత నిలదొక్కుకుంటాయనే ఆలోచనతో ఇందిరా మహిళా డెయిరీను 2011లో రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. మధిర ప్రాంతం పరిధిలో వ్యవసాయాధారిత జీవనం తప్ప మరో దారి లేదని, దీనిని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

కుటుంబం దగ్గర డబ్బులు ఉంటే పిల్లలను మంచి చదువులు చదివిస్తారని,చదువుకున్న పిల్లలు కుటుంబాల స్థితిగతులను పూర్తిగా మారుస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు.ఇందిరా మహిళా డెయిరీ ద్వారా మహిళలకే పాడి పశువులు అందించి,పాల సేకరణ నుంచి ప్యాకింగ్, బై ప్రోడక్ట్ (వెన్నె, మజ్జిగ, పెరుగు, నెయ్యి, స్వీట్స్)ఉత్పత్తి, మార్కెటింగ్ చేసి లాభాలు పొంది మహిళలు పంచుకోవాలనే కలతో ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు కోసం 9.5 ఎకరాల స్థలం సేకరించి భూమి పూజ కూడా చేసామని,ప్రత్యేక రాష్ట్ర విభజన ఉద్యమాలు, గత ప్రభుత్వం మహిళల పట్ల ఆలోచన లేకుండా ఈ డెయిరీనీ పక్కన పడేసిందని అన్నారు.ఈ ప్రాజెక్టు ఆపడంతో పాటు మహిళల 500 రూపాయల తినేసారని గతంలో తప్పుడు ప్రచారాలు కూడా చేశారని, మహిళలు ఇచ్చిన డిపాజిట్ సొమ్ము ఎవరు కొట్టేయకుండా జాగ్రత్తగా కాపు కాయడం జరిగిందని, నేడు దాదాపు 40 లక్షల రూపాయలు అందుబాటులో ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 20 వేల మహిళలు ఇందిరా మహిళా డెయిరీలో సభ్యులుగా ఉన్నారని, వీరికి తల రెండు పాడి పశువులు అందిస్తామని, దీని ద్వారా రోజూ దాదాపు 2 లక్షల 40 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుందని,నెలకు 25 కోట్లకు పైగా మహిళలు సంపాదించే అవకాశం ఉందని అన్నారు.పాలు మాత్రమే కాకుండా మజ్జిగ, నెయ్యి,వెన్నె,స్వీట్స్ అమ్మకాలు కూడా కలిపితే సంవత్సరానికి ఇందిరా మహిళా డెయిరీ టర్నోవర్ 500 కోట్లు దాటుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, డిఆర్డీవో, సన్యాసయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.వేణు మనోహర్, ఇందిరా మహిళా డెయిరీ చైర్మన్ అన్నపూర్ణ, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com